ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 204

మంగళవారం 28 జనవరి 2025 / చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ / HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

ఐసీసీ టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా

## జస్‌ప్రీత్ బుమ్రా



.. వివరాలు 7లో

## కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలుస్తుంది

మోదీ సర్కార్‌కు వ్యాపారులే ముఖ్యం

జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీలో రాహుల్



కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలుస్తుందని, వారికి అండగా ఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తాము అధికారంలో ఉన్న తెలంగాణలో కులగణన సర్వేను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. రిజర్వేషన్లలో ఓబీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇండోర్, రోమింగ్‌న్యూస్: పేదలకు, ఓబీసీలకు న్యాయం జరిగేలా పోరాడుతామని అన్నారు. సోమవారం ఇండోర్ లో నిర్వహించిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ.. మోదీ సర్కారుకు వ్యాపారులే ముఖ్యమని విమర్శించారు. బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక

మిగతా 2 లో

## రాజ్యాంగ పరిరక్షణకు తామంతా పోరాడుతున్నాం

రాహుల్ వెన్నంటి నడుస్తున్నాం

ఇండోర్ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి




02



## ప్రపంచాభివృద్ధిలో భారతదేశ యువత కీలక భూమిక

వీరి భాగస్వామ్యం లేకుండా అభివృద్ధిని ఊహించలేం

ఎన్‌సిసి ర్యాలీలో ప్రధాని మోడీ ఉద్ఘాటన



ప్రపంచాభివృద్ధిలో భారతదేశ యువత కీలక భూమిక వహిస్తోందని, వీరి భాగస్వామ్యం లేకుండా ప్రపంచాభివృద్ధిని ఊహించలేమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దశాబ్దాలుగా దేశ యువత ఎదుర్కొంటున్న సమస్యలను తొలగించేందుకు తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు.

న్యూఢిల్లీ, రోమింగ్‌న్యూస్: ఢిల్లీలోని కరియప్ప గ్రౌండ్స్‌లో సోమవారంనాడు జరిగిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ర్యాలీలో ప్రధాని పాల్గొన్నారు. ఎన్‌సీసీ డవలప్‌మెంట్‌కు గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పనితీరు తనకు చాలా సంతృప్తిని ఇచ్చిందని మోదీ అన్నారు. 170 సరిహద్దు ప్రాంతాలు, సుమారు 100 తీరప్రాంత సరిహద్దులకు

మిగతా 2 లో




### రైతుబంధును ఎగ్గొట్టాడని రైతుల శాపనాలు

సీఎం రేవంత్‌పై రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

పథకాలపై నిలదీతలతో సమాధానాలు చెప్పలేకపోతున్నాం

రేవంత్ కంటే కేసీఆర్ పాలనే బాగుంది

05



05

### ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ మంజూరు

10 నెలలు జైలులో గడిపిన తిరుపతన్న



## తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్

హామీల అమలుకు జేఏసీ సమ్మె నోటీసు

హైదరాబాద్, రోమింగ్‌న్యూస్: తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నేతలు ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, 2 పీఆర్‌సీల అమలు, సీసీఎస్, పీఎఫ్

మిగతా 2 లో

## రైతు ఖాతాల్లోకి రైతు భరోసా జమ

రాష్ట్ర వ్యాప్తంగా 4,41,911 మంది ఖాతాల్లోకి నగదు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

హైదరాబాద్, రోమింగ్‌న్యూస్: రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా జమ చేసే పక్రియ కొనసాగుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తొలి విడతలో మండలానికి ఒక గ్రామంలో రైతు భరోసా సొమ్ము విడుదల చేస్తున్నట్లు చెప్పారు. సొమవారం రాష్ట్ర వ్యాప్తంగా 4,41,911 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేసినట్లు చెప్పారు. 577 మండలాల్లోని 9,48,333 ఎకరాలకు గాను రూ.530 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రైతు భరోసా ఇస్తామని మంత్రి తుమ్మల స్పష్టం

మిగతా 2 లో



## ప్రయాగ్ రాజ్‌లో అమిత్‌షాకు ఘన స్వాగతం

స్వాగతం పలికిన సిఎం యోగి తదితరులు

కుంభమేళాలో స్నానమాచరించిన అమిత్ షా



04

## గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తాం?

నక్సలైట్లతో కలసి వందలాదిమంది బిజెపి వాళ్లను హతమార్చారు

ఈటెల రాజేందర్ నక్సలైట్ కాదంటూ కితాబు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు



కరీంనగర్, రోమింగ్‌న్యూస్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డుల విషయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తామంటూ ఆయనను అవమానించేలా

మిగతా 2 లో



## కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో తిరుగుబాటు


గ్రామసభల్లో నిలదీసినా కప్పిపుచ్చుకునే యత్నం

హామీల అమలుకు ఏడాదైనా పూర్తి చేయని వైనం

మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు

## సూర్యాపేటలో మరో పరువు హత్య

సూర్యాపేటలోని మామిల్లగడ్డకు చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి హత్యకు హత్యకు గురయ్యాడు. పిల్లలమర్రి సమీపంలోని మూసీ కాలవ కట్టపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.



04

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
28 జనవరి
2025



# ప్రపంచాభివృద్ధిలో భారతదేశ యువత కీలక భూమిక

మొదటి పేజీ తరువాయి

ఎన్‌సీసీ క్యాడెట్లు విస్తరించారని, తద్వారా ఆయా ప్రాంతాల్లో నివసించే వారికి ఎంతో ప్రయోజనం చేకూరిందని చెప్పారు. 'ఒకే దేశం ఒకే ఎన్నికలు'పై డిబేట్‌ను ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ క్యాడెట్లు కొనసాగిం చాలని, దేశ యువత భవిష్యత్తుకు ఏకకాలంలో ఎన్నికలు కీలకమని అన్నారు. ప్రతి నెలలోనూ ఎన్నికలు జరుగుతూ పోతుంటే కాలేజీలు, విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు సమయం ఎక్కడ దొరుకుతుందని ప్రశ్నించారు. వికసిత్ భారత్' ఉద్దేశాలపై ఎన్‌సీసీ క్యాడెట్లతో సహా దేశ యవత దృష్టిసారించాలని మోదీ కోరారు. దేశ వికాశంతోనే భారత్ అంతర్జాతీయంగా ఉన్నత స్థాయికి చేరుకుంటుందన్నారు. 2014లో 14 లక్షల మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 20 లక్షలకు చేరుకుందని, వీరిలో 8 లక్షల మందికి పైగా మహిళలే ఉండటం గర్వకారణమని




చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫార్మ్‌డ్ యూత్ ఆర్గనైజేషన్‌గా ఎన్‌సీసీ నిలవడం, డిజాస్టర్ మేనేజిమెంట్‌తో సహా అన్ని రంగాలకు ఎన్‌సీసీ సేవలు విస్తరిస్తుండటం ముదావహమని చెప్పారు.

# కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలుస్తుంది



మొదటి పేజీ తరువాయి

విధానాలను అవలంబి స్తోందని అన్నారు. స్వాతంత్రోద్యమాన్ని అవమానపర్చేలా ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. అమిత్ షా సాక్షాత్తూ పార్లమెంటులోనే అంబేద్కర్ ను అవమాన పర్చారని అన్నారు. దేశంలో 90శాతం మందికి చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కడం లేదని, జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని రాహుల్ గాంధీ చెప్పారు. రిజర్వేషన్లలో ముఖ్యంగా ఓబీసీలకు అన్యాయం జరుగుతోందని అన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలోని విద్యా వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. జీఎస్టీ పేరుతో ప్రజలను లూఠీ చేస్తోందని అన్నారు. కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామని రాహుల్ గాంధీ చెప్పారు. ఈ సందర్భంగా భాజపా , ఆర్‌ఎస్‌ఎస్‌లపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో స్వాతంత్య్రం పూర్వం నాటి పరిస్థితులను కోరుకుంటున్నాయని ఆరోపించారు. ప్రజలను మరోసారి బానిసలుగా మారుస్తున్నారని ఆరోపణలు చేశారు. 'ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ రాజ్యాంగంపై దాడికి పాల్పడుతున్నారు. భాజపా, ఆర్‌ఎస్‌ఎస్ నుంచి కాంగ్రెస్ రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం చేస్తోంది. దేశంలో స్వాతంత్య్రానికి పూర్వం నాటి పరిస్థితులను భాజపా, ఆర్‌ఎస్‌ఎస్ మళ్లీ కోరుకుంటున్నాయి. దళితులు, వెనుకబడిన వర్గాలు, ఆదివాసీలు, పేదలను మరోసారి బానిసలుగా మారు-స్తున్నాయి. రాజ్యాంగం మారిన రోజు ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు ఉండవు' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా రాహుల్ దేశ విద్యా వ్యవస్థ గురించి ప్రస్తావించారు. 'ప్రైవేటు వ్యవస్థలో విద్య, వైద్య రంగాల యాజమాన్యం ఎవరి చేతిలో ఉంది..? మన భారత విద్యా రంగం స్టాంపులు, సర్టిఫికేట్ల వ్యవస్థగా మారింది. సర్టిఫికేట్లు వస్తే.. ఉద్యోగాలు వస్తాయని కోట్లాది మంది ప్రజలు భావిస్తున్నారు. ఇదంతా పచ్చి అబద్ధం. అలా చేస్తే మీ పిల్లలు దేశంలో ఎలాంటి ఉ పాధి పొందలేరు. ఈ బిలియనీర్లు దేశ ఉపాధి వ్యవస్థను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, ఆర్‌ఎస్-ఎస్ నేతలపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విరుచుకుపడ్డారు. 'ప్రస్తుతం హస్తం పార్టీని తప్పుపడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ నేతలు స్వాతంత్య్రం కోసం ఎటువంటి పోరాటం కూడా చేయలేదు. పేదరికం, నిరుద్యోగం నుంచి ప్రజలు విముక్తి పొందాలంటే రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# కుంభమేళాలో స్నానం చేసినా పాపం పోదు

## మోదీ, అమిత్ షాలు ఖచ్చితంగా నరకానికే పోతారు

### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,జనవరి 27 : మహాకుంభమేళా సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా గంగా నదిలో మునిగితే కచ్చితంగా నరకానికే వెళ్తారు అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నేడు అమిత్ షా మహాకుంభమేళాలో పవిత్ర స్నానాలు చేశారు. ఫిబ్రవరి 5వ తేదీన మహాకుంభమేళాకు ప్రధాని మోడీ రానున్నారు. ఈ సందర్భంగా ఖర్గే సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'గంగానదిలో స్నానం చేయడం వల్ల పేదరికం పోతుందా? అది ఆహారాన్ని అందిస్తుందా? నేను ఎవరి విశ్వాసాన్ని దెబ్బతీయాలని అనుకోవడం లేదు. నా మాటలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే నేను క్షమాపణలు కోరుతున్నాను. కానీ పిల్లలు ఆకలితో చనిపోతున్నప్పుడు, పాఠశాలకు వెళ్లలేకపోతున్నప్పుడు, కార్మికులకు జీతం అందనప్పుడు, బిజెపి నేతలు గంగలో స్నానం చేయడానికి పోటీపడుతున్నారు. వారు టీవీల్లో పబ్లిసిటీ కోసమే ఇదంతా చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తుల నుండి దేశం ప్రయోజనం పొందదు. ప్రధాని మోడీ, అమిత్‌షా ఎన్నో తప్పులు చేశారు. అలాంటి వ్యక్తులు కుంభమేళాలో స్నానం చేస్తే విముక్తి రాదు. వారు కచ్చితంగా నరకానికి వెళ్తారు' అంటూ వ్యాఖ్యానించారు. ఖర్గే వ్యాఖ్యలపై బిజెపి నేతలు కౌంటరిస్తున్నారు. ఖర్గే సనాతన ధర్మంపై దాడి చేశారని బిజెపి అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా అన్నారు. ఖర్గే వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని, దీనిపై కాంగ్రెస్ పార్టీ వివరణ ఇవ్వాలని ఆయన అన్నారు.

# రైతు ఖాతాల్లోకి రైతు భరోసా జమ

మొదటి పేజీ తరువాయి



చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి రోజు 15,414 కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి తుమ్మల చెప్పారు. 'కొత్త కార్డుల్లో 51,912 మందికి ఫిబ్రవరి నుంచి రేషన్ పంపిణీ చేస్తాం. తొలి రోజు మండలానికి ఒక గ్రామం చొప్పున కొత్త రేషన్ కార్డులు జారీ చేశాం. పాత రేషన్ కార్డుల్లో అదనంగా 1.03 లక్షల మంది పేర్లు చేర్చారు. 501 గ్రామాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రారంభమైంది. మొదటి రోజు 20,336 మంది భూమిలేని కూలీలకు నిధులు విడుదలయ్యాయి' అని తెలిపారు. ఈ ఏడాది రైతుభరోసా కింద ప్రతి ఎకరాకు రూ.12 వేలు ఇవ్వనున్నట్లు మంత్రి తుమ్మలచెప్పారు. భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రెండు విడతలుగా రూ.12 వేలు ఇస్తామని పేర్కొన్నారు. రైతులకు యాసంగికి పెట్టుబడి సాయం, కూలీలకు రూ.6 వేలు ఖాతాల్లో పడతాయని వివరించారు. సోమవారం నుంచి బ్యాంకుల్లో నగదు తీసుకోవచ్చన్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉన్నా రూ.2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేశామన్నారు. అందుకు రూ.21 వేల కోట్లు చెల్లించామని ప్రకటించారు. పథకాల అమలు నిరంతర పక్రియ అని అన్నారు. అర్హులైన అందరికీ పథకాలు వస్తాయని స్పష్టం చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఏడాదికి 3,500 ఇళ్లు మంజూరవుతాయని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణకు తామంతా పోరాడుతున్నాం

## రాహుల్ వెన్నంటి నడుస్తున్నాం

### ఇండోర్ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి




ఇండోర్, జనవరి 27 : రాజ్యాంగ పరిరక్షణకు తామంతా రాహుల్ గాంధీ వెన్నంటి పోరాడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇది ఎన్నికల ర్యాలీ కాదని, ఒక యుద్ధమని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ పోరాటం చేస్తున్నామని చెప్పారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇండోర్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఈ పరిణామాన్ని గ్రహించే పోరాడుతున్నారని చెప్పారు. గజనీ మహమ్మద్ హిందుస్థాన్‌ను దోచుకునేందుకు యత్నించినట్టు మోదీ రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ పేరుతో కొనసాగుతున్న బ్రిటీష్ జనతా పార్టీని ఎదుర్కొనేందుకు రాహుల్ పోరాడుతున్నారని చెప్పారు. ఇది గాంధీ పరివార్, గాడ్సే పరివార్ ల మధ్య సాగుతున్న యుద్ధమని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని రక్షిస్తుందని, రిజర్వేషన్లు కాపాడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మధ్య ప్రదేశ్ లోని ఇండోర్ లో జరిగిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీకి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ, అమిత్ షా రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల సమయంలో బీజేపీ 400 సీట్లు అడిగిందని, అబ్ కీ బార్ చార్ సౌ పార్ అనే నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లిందని అన్నారు. ప్రజలు వాళ్ల కుట్రలను గ్రహించే 240 సీట్లకు పరిమితం చేశారని సీఎం రేవంత్ చెప్పారు. రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణ బీజేపీ విధానమని పేర్కొన్నారు. లోక్ సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డ నాటి నుంచి బీజేపీ నేతలు ఆందోళనలో ఉ న్నారని అన్నారు. 2025 వాళ్లకు కీలకంగా మారిందని అన్నారు. బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకే తాము జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహిస్తున్నామని సీఎం చెప్పారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలోనూ రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణే ధ్యేయమని చెప్పారని, దానికి కట్టుబడే కాంగ్రెస్ పార్టీ పోరాటాలు సాగిస్తోందని అన్నారు. బీజేపీకి అంబేద్కర్ పేరు అన్నా.. రాజ్యాంగం, రిజర్వేషన్లు అన్నా నవ్వులాటగా మారాయని అన్నారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి తదితరులు ఉన్నారు.

# గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తాం?

మొదటి పేజీ తరువాయి

ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'పద్మ' అవార్డుల కోసం జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలని, గద్దర్‌కు ఎట్లా పద్మ అవార్డు ఇస్తామని ఆయన ప్రశ్నించారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు పద్మ అవార్డ్ ఇవ్వకపోవడంపై తెలంగాణ ప్రభుత్వం చేస్తోన్న విమర్శలకు కేంద్రమంత్రి, బీజేపీ కీలక నేత బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. ఎంతో మంది బీజేపీ కార్యకర్తలను, ఎన్ కౌంటర్లలో పోలీసులను పొట్టన బెట్టుకున్న వ్యక్తి గద్దర్ అని.. అలాంటి వ్యక్తికి పద్మ అవార్డు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మావోయిస్టుగా పని చేసి ఎంతో మంది ప్రాణాలు తీసిన వారిలో గద్దర్ ఒకరని.. ఆయనకు పద్మ అవార్డు ఇచ్చేదే లేదని కుండబద్దలు కొట్టారు.సోమవారం కరీంనగర్లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ నక్సలైట్ కాదన్నారు. మావోయిస్టు భావజాలం వేరు.. నక్సలైట్‌గా పని చేయడం వేరని పేర్కొన్నారు. నక్సలిజంతో ఎంపీ ఈటల రాజేందర్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. అలాగే.. నంది అవార్డుల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలను కుంటున్న గద్దర్ అవార్డులు మా వాళ్ళు తీసుకోరని బండి సంజయ్ స్పష్టం చేశారు. గద్దర్ కాంగ్రెస్, టీడీపీకి చెందిన



నేతలను హతమార్చారని.. ఆ విషయం సీఎం రేవంత్ రెడ్డికి తెల్వదని అన్నారు. గద్దర్‌కు వ్యతిరేకంగా మాట్లాడానని.. నా దిష్టి బొమ్మ తగలబెడితే నా ఆయుష్షే పెరుగుతుందని సెటైర్ వేశారు కేంద్రమంత్రి బండి సంజయ్. 'గద్దర్ ఎంత మంది బీజేపీ కార్యకర్తలను కాల్చి చంపించారో తెలియదా..?' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేసిన వందల మంది బీజేపీ కార్యకర్తలను నక్సలైట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్ అని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తోందని, తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో.. ఎవరు బలైపోయారో ప్రజలందరికీ అర్థమైందని అన్నారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన పద్మ అవార్డుల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాము గోరటి వెంకన్న, గద్దర్, జయధీర్ తిరుమలరావు, చుక్కా రామయ్య, అందెశ్రీ పేర్లు సిఫార్సు చేసినా కేంద్రం పట్టించుకోలేదని రేవంత్ విమర్శించారు. ఏపీకి 5 అవార్డులు ఇచ్చారని, తెలంగాణకు నాలుగైనా ఇవ్వాల్సిందని అన్నారు. పద్మ అవార్డుల విషయంలో చూపిన వివక్షపై కేంద్రానికి లేఖ రాస్తానని సీఎం అన్నారు. సీఎం వ్యాఖ్యలపై తాజాగా బండి సంజయ్ ఈ హాట్ కామెంట్స్ చేశారు. పద్మ అవార్డులు అర్హులకే వచ్చాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మంచి పేర్లు పంపితే కేంద్రం పరిశీలిస్తుందని, ఏ పేరు పడితే ఆ పేరు పంపితే పద్మ అవార్డులు ఇవ్వరని సంజయ్ అన్నారు. 'గద్దర్‌కి పద్మ అవార్డు ఎలా ఇస్తాం..? ఆయన భావజాలం ఏంటి..? బరాబర్ గద్దర్‌కు ఇవ్వం. ఎందరో బీజేపీ నేతలను చంపిన వ్యక్తుల్లో గద్దర్ ఒకరు. పద్మ అవార్డులు స్థాయి ఉన్న వారికే ఇస్తాం. బీజేపీ కార్యకర్తలను, పోలీసులను చంపిన వారికి అవార్డులు ఎలా ఇస్తాం..? అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్

మొదటి పేజీ తరువాయి

డబ్బులు రూ.2,700 కోట్లు చెల్లింపు తదితర డిమాండ్లను యాజమాన్యం ముందు ఉంచారు. డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మెకు దిగుతామని నోటీసుల్లో పేర్కొన్నారు. ' మేనిఫెస్టోలోని అంశాలను ప్రభుత్వం అమలు చేయాలి. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, నిర్వహణను ప్రైవేటు కంపెనీలు చేస్తున్నాయి. వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ట్రేడ్ యూనియన్లకు ఎన్నికలు నిర్వహించడం లేదు. యూనియన్లు రద్దు చేసి, కార్మికులకు పనిగంటలు పెంచారు.' అని జేఏసీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున కార్మిక సంఘాల నేతలు బస్ భవన్ వద్దకు చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నప్పటికీ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై స్పందించడం లేదన్నారు. ఆర్టీసీ కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారని సంఘాల నేతలు మండిపడ్డారు. ఇలానే నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వానికి తమ తడాఖా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఐదేండ్ల తర్వాత సమ్మె చేయడం ఇదే తొలిసారి అని గుర్తు చేశారు. ఆర్టీసీని ప్రయివేటుపరం చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఒక వేళ అదే కనుక జరిగితే.. వేలాది మంది ఆర్టీసీ కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న ప్రతిపాదనను మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున కార్మిక సంఘాల నేతలు బస్ భవన్ వద్దకు చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
28 జనవరి
2025







# ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**నారా చంద్రబాబు నాయుడు**

**వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారపూర్వకంగా నిర్వహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపిన ఆర్యవైశ్య ప్రముఖులు**



ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ నారా లోకేష్ ను ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని మానిఫెస్టో లో పెట్టాలని కోరగా ఆ నాడు లోకేష్ , చంద్రబాబు నాయుడు అదే విధంగా పవన్ కళ్యాణ్ ని ఒప్పించి మానిఫెస్టో లో ఈ అంశాన్ని పెట్టడం జరిగింది. మానిఫెస్టో లో పెట్టడంతోపాటు ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం 'మాఘ శుద్ధ విదియ ' తిథి నాడు నిర్వహించాలని జీవో నెంబర్ 181 ని విడుదల చేసింది ఎన్డీయే ప్రభుత్వం. ఆర్యవైశ్య ఇలవేల్పు శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. మేనిఫెస్టోలో ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఆర్యవైశ్యులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే పరిస్థితిని ప్రభుత్వం కల్పించిందని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు తెలిపారు. నాడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్నామని చంద్రబాబునాయుడు తెలిపారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ గారి ఆధ్వర్యంలో వివిధ ఆర్యవైశ్య సంఘాల నాయకులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని కలిసి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ గారు,వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఇరుకుల రామకృష్ణ ఈనెల 31 వ తేదీన పెనుగొండ లో జరిగే ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# గుట్టలో జైభవాని బంగారం బాధితుల రిలే దీక్షలు

**పరారైన మార్వాడీని పట్టుకుని సొత్తు ఇప్పించే వరకు షాపులు తెరవొద్దని డిమాండ్**






**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** ప్రజలు కుదువపెట్టిన బంగారం, నగదుతో పరారైన జైభవాని జ్యూయల్లర్స్ ఓనర్ జితేందర్ సింగ్ రాథోర్ ను పట్టుకుని తమ సొత్తును తిరిగి ఇప్పించే వరకు యాదగిరిగుట్టలోని మిగతా మార్వాడీ దుకాణాలను తెరవొద్దని మార్వాడీ బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం యాదగిరిగుట్టలోని జైభవాని జ్యూయల్లర్స్ షాప్ ఎదుట బాధితులు రిలే దీక్షలకు దిగారు. 'మార్వాడీలను వెళ్లగొట్టండి, ఊరిని కాపాడండి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ.. తమ అవసరాల కోసం తమ బంగారాన్ని మార్వాడీ దగ్గర తాకట్టు పెట్టుకున్నామని, ఇలా మోసం చేస్తాడని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరారీలో ఉన్న మార్వాడీ దొరికేంత వరకు యాదగిరిగుట్టలో ఉన్న మార్వాడీ షాపులను తెరవొద్దన్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదేశాలను పోలీసులు తూచా తప్పకుండా పాటించాలని డిమాండ్ చేశారు. పరారీలో ఉన్న మార్వాడీ జితేందర్ సింగ్ రాథోర్ ను వెంటనే అరెస్ట్ చేసి తమ సొత్తును తమకు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. మా సొమ్ము, డబ్బును ఇప్పించేంత వరకు గాంధేయ మార్గంలో రిలే దీక్షలు కొనసాగిస్తామని ప్రకటించారు.


## మార్వాడీ షాప్ ఎదుట బాధితుల ఆందోళన

యాదగిరిగుట్టలో స్థానికులు బంగారం కుదువపెట్టిన జైభవాని జ్యూయల్లర్స్ పక్కన ఉన్న మరో జ్యూయల్లరీ షాప్ ఎదుట బాధితులు ఆందోళనకు దిగారు. పరారీలో ఉన్న మార్వాడీ నిందితుడు పట్టుబడకముందే మార్వాడీ దుకాణాలను ఎలా తెరుస్తారని షాప్ ఓనర్లతో బాధితులు వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదేశించినట్లుగా.. నిందితుడు దొరికేంత వరకు పట్టణంలో ఉన్న మార్వాడీ దుకాణాలను తెరవొద్దని డిమాండ్ చేశారు. మార్వాడీ దుకాణాలను తెరవొద్దని ఎమ్మెల్యే చెప్పినా ఓపెన్ చేయడానికి ఎలా అనుమతించారని పోలీసులతో బాధితులు గొడవకు దిగారు. పోలీసులు మార్వాడీల నుండి ముడుపులు తీసుకుని.. బాధితులకు కాకుండా మార్వాడీలకు మద్దతుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మార్వాడీ షాపులను తెరవాలని చూస్తే మాత్రం ఎంతకైనా తెగిస్తామని హెచ్చరించారు. దీంతో తెరుచుకున్న మార్వాడీ షాపులను పోలీసులు మూసివేశారు. అనంతరం జైభవాని జ్యూయల్లర్స్ షాప్ ఎదుట బాధితులు రిలే దీక్షలు షురూ చేశారు.

# రుస్తాపూర్ లో బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఐలన్న

**ఆలేరు శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బిర్ల ఐలన్న కు ఘన సన్మానం**






**తుర్కపల్లి, రోమింగ్ న్యూస్:** ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండలం రుస్తాపూర్ గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి మరియు శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలలో ముఖ్యఅతిథిగా శ్రీ ఆలేరు శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బిర్లా ఐలన్న గారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ సూపర్ చేర్మెన్ మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ధనవత్ శంకర్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, చాడ భాస్కర్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు, భాస్కర్ నాయక్, రుస్తాపూర్ ఎంపీటీసీ ధనావత్ మోహన్ బాబు నాయక్, వీరారెడ్డిపల్లి ఎంపిటిసి,కానుగంటి శ్రీనివాస్ యాదవ్,ఉపాధ్యక్షుడు రాజారామ్, గ్రామ శాఖ అధ్యక్షుడు, వెంకటేష్ యాదవ్, మాజీ అధ్యక్షుడు బూడిద రమేష్, మండల కాంగ్రెస్ నాయకులు, ఎరుకల వెంకటేష్ గౌడ్, కిషన్ యాదవ్,విగ్నేష్ గౌడ్,బింగి శ్రీధర్ గౌడ్, వలందాస్ బాలు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు రమేష్,గౌడ్ నీలం సునీల్,వొంకరి ప్రసాద్, కొండల్, గణేష్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పొంగల బాలకృష్ణ , యూత్ ఉపాధ్యక్షుడు, శ్రీశైలం,బానోత్ వినోద్ నాయక్, మరియు మండల మల్లేష్ నాయకులు భూక్యా శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ, ధర్మ నాయక్ మాజీ సర్పంచ్ గోవింద్,వివేక్ గౌడ్,శ్రీనూ వర్కింగ్ ప్రెసిడెంట్,జిల్లా నాయకులు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# 'రైతుభరోసా పైసలు పడ్డయ్'.!

**సంతోషం వ్యక్తం చేస్తున్న రైతన్నలు**






**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** ప్రభుత్వం ముందే చెప్పిన విధంగా జనవరి 26 నుండి రైతుల అకౌంట్లలో రైతుభరోసా డబ్బులు పడుతున్నట్లు ఆయా బ్యాంకుల ద్వారా రైతులకు మెసేజీలు వస్తున్నాయి. జనవరి 26 ఆదివారం సెలవు రోజు కావడంతో.. సోమవారం రైతుల ఖాతాల్లో రైతుభరోసా డబ్బులు జమ అయినట్లు బ్యాంకుల నుండి మెసేజీలు వచ్చాయి. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్న యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో రైతుల అకౌంట్లలో డబ్బులు జమ అయ్యాయి. మైలారుగూడెం గ్రామానికి చెందిన ఎడపెల్లి పర్వతాలుకు.. సైదాపురం రెవెన్యూ పరిధిలో 2.16 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీనికి సంబంధించిన రూ.14,025 రైతుభరోసా డబ్బులు బ్యాంక్ అకౌంట్ లో డిపాజిట్ అయినట్లు ఫోన్ కు మెసేజ్ వచ్చిందని తెలిపారు. అలాగే బండారు స్వామి అనే రైతుకు 3.14 ఎకరాల భూమి ఉండగా.. రైతుభరోసా కిందా రూ.20,170 డబ్బులు తన బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. సైదాపురం రెవెన్యూ పరిధిలో మొత్తం 918 మంది రైతులకు 1972 ఎకరాల సాగుకు యోగ్యమైన భూమి ఉండగా.. రూ.1,18,32,000 రైతుభరోసా డబ్బులు రైతుల అకౌంట్లలో జమ అయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా చెప్పినట్లుగానే రైతుభరోసా అమలు చేయడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏడాదిలో ఎకరానికి రూ.10 వేలే వచ్చేవని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేలు ఇస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ఈ డబ్బులతో వ్యవసాయ సాగు పెంచుకునే అవకాశం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు రైతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పి ఆర్ టి యు ఆధ్వర్యంలో పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని వినతి

నకిరేకల్ : మండల పి ఆర్ టి యు ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నకిరేకల్ మండల తాహసిల్దార్ రికి సిపిఎస్ రద్దు యుపిఎస్ కూడా వద్దు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి ఆర్టి యు మండల శాఖ అధ్యక్షులు వంటల ఆనంద్ బాబు ప్రధాన కార్యదర్శి చిక్కుల సుధాకర్ రాష్ట్ర అసోసియేటీ అధ్యక్షులు కప్పల యాదయ్య సార్ మండల అసోసియేటీ అధ్యక్షులు ఒట్టె సైదులు పొడిచేటి శంకర్ ముజీబ్ సార్ తదితరులు పాల్గొన్నారు.



# తలనొప్పిగా అపార్... ఆధార్

**జనన ధ్రువీకరణలో తప్పులు - ఆందోళనలో తల్లిదండ్రులు**

**ఈనెల 31 వరకు వివరాలు ఇవ్వాలని స్కూళ్లకు విద్యా శాఖ ఆదేశాలు**

**హైదరాబాద్ జనవరి 26:** ఒకే దేశం.. ఒకే ఐడీలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అపార్( ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రి) జారీ ప్రక్రియ నత్తనడకన సాగుతున్నది. ఈనెల 31 వరకు వివరాలు అందించాలని విద్యాశాఖ ఇప్పటికే స్కూళ్లకు ఆదేశాలు జారీ చేసింది. కానీ అపార్ నమోదులో టీచర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.జిల్లాలలో కూడా యాజమాన్యాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)-2020లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అపార్ ఐడీ తీసుకొచ్చింది. అపార్ కార్డుపై 17 అంకెల యూనిక్ నంబర్తో పాటు క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఇందులో విద్యార్థికి సంబంధించిన సంక్షిప్త సమాచారం ఉంటుంది. విద్యార్థుల పేర్లు పాఠశాల రికార్డుల్లో ఒక విధంగా ఆధార్ కార్డుల్లో మరో విధంగా ఉంటే వెబ్సైట్ వాటిని తీసుకోవట్లేదు. దానిని పరిష్కరించేందుకు టీచర్లు జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని కోరుతున్నారు. అందులో ఏవైనా తేడాలుంటే ఐడీ క్రియేట్ చేయడం సాధ్యం కావట్లేదు ఆధార్ తీసుకునే సమయంలో చాలా తప్పులు దొర్లుతున్నాయి. పుట్టిన తేదీల్లోనూ తప్పులను నమోదు చేశారు. ఇప్పుడు వాటిని సరిదిద్దడం స్కూలు యాజమాన్యాలకు తలకు మించిన భారంగా మారింది. హైదరాబాద్లో 3122 స్కూళ్లు ఉన్నాయి. 10,10,550 మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పటికీ 2.66 లక్షల విద్యార్థులకు మాత్రమే అపార్ ఐడీ జనరేట్ అయినట్టు అధికారులు తెలిపారు. చాలా స్కూళ్లకు ఇప్పటికీ అపార్ ప్రక్రియనే మొదలుపెట్టలేదు. దీంతో ఇప్పుడు ఈనెల 31 వరకు గడువు సమీపిస్తుండటంతో ప్రైవేటు పాఠశాలలు, సర్కారీ స్కూళ్లు విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం పంపించారు. అపార్ ఐడీకి సంబంధించిన ఆధార్, డిక్లరేషన్ ఫారం ఇవ్వాలని సూచించారు. అయితే ఇప్పుడు తమ పిల్లల ఆధార్ కార్డుల్లో, స్కూల్ రిజిస్టర్లో ఉన్న పేర్ల మధ్య వ్యత్యాసాలు ఉండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రక్రియలో విద్యార్థుల పేర్లల్లో మార్పులు, చేర్పులు ఉంటే డిప్యూటీ ఐఓఎస్ ఆధ్వర్యంలో చేయనున్నారు. అయితే ఈ ప్రక్రియ కాస్త ఆలస్యంగా సాగనున్నది. సరైన సమాచారం ఇస్తేనే విద్యార్థులకు అపార్ ఐడీ జనరేట్ అవుతుందని అధికారులు తెలిపారు. ఏమైన మార్పులు, చేర్పులు ఉంటే ఐడీ జనరేట్ కాదని, తర్వాత పరిశీలిస్తామని వివరించారు. ప్రతి విద్యార్థి యొక్క పూర్తి సమాచారం డిజిటల్ రూపంలో అపార్ కార్డులో సేవ్ చేయబడుతుంది. విద్యా నాణ్యతతో పాటు క్రీడా నైపుణ్యాలను కూడా నమోదు చేస్తారు. విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారే క్రమంలో ఈ అపార్ కార్డు ఉపయోగపడుతుంది. వివిధ పాఠశాలల్లో అడ్మిషన్ల నుంచి ఉద్యోగాల పొందే వరకు అపార్ కార్డు కేంద్రంగానే సాగుతుందని అధికారులు తెలిపారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
28 జనవరి
2025





# బంగారం బాధితులకు అండగా ఉంటాం

## ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ నిలబెట్టుకోవాలి : ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి

**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** 'జైభవాని జ్యూయల్లర్స్'లో బంగారం కుదువపెట్టి మోసపోయిన బాధితులకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇచ్చిన మాట నిలబెట్టుకుని నిందితుడిని వెంటనే పట్టుకోవాలని ప్రభుత్వ మాజీ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి డిమాండ్. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇచ్చిన మాట మేరకు రెండు రోజుల్లో పరారైన మార్వాడీని పట్టుకుని బంగారం, నగదు రికవరీ చేయకుంటే.. బాధితుల తరఫున బీఆర్ఎస్ పోరాటానికి దిగుతుందని హెచ్చరించారు. యాదగిరిగుట్టలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ల పదవీకాలం ముగిసిన సందర్భంగా సోమవారం నిర్వహించిన వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అమాయక స్థానిక ప్రజల బంగారం ఆభరణాలు, నగదుతో ఉడాయించిన సదరు మార్వాడీ వ్యాపారిని వెంటనే అరెస్ట్ చేసి ప్రాపర్టీ రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. పరారీలో ఉన్న మార్వాడీని పట్టుకునేంత వరకు పట్టణంలో ఉన్న మిగతా మార్వాడీ దుకాణాలను తెరవనియ్యమని స్వయంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చెప్పిన విషయాన్ని ఉదహరించిన ఆమె.. సదరు మార్వాడీ ఆచూకీ లభించకున్నా మార్వాడీ షాపులు తెరుచుకోవడంలో ఆంతర్యం ఏంటో అర్థం కావడం లేదన్నారు. పరారైన మార్వాడీని తీసుకొచ్చే బాధ్యత తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ కు స్టేజ్ పైనుండే ఎమ్మెల్యే చెప్పాడంటే.. మార్వాడీ పరారీ వెనుక కాంగ్రెస్ నాయకుల హస్తం ఉందా.? అని స్థానిక ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఏదేమైనా మార్వాడీ బాధితులకు ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు.. రెండు రోజుల పాటు వెయిట్ చేస్తామని, ఆలోపు నిందితుడిని అదుపులోకి తీసుకోకపోతే బాధితులకు అండగా పోరాటానికి బీఆర్ఎస్ రంగంలోకి దిగుతుందని స్పష్టం చేశారు. ఇక యాదగిరిగుట్ట మున్సిపల్ పీఠాన్ని బీఆర్ఎస్ దక్కించుకోవడం కోసం ఎన్ని కష్టాలు పడ్డానో తనకే తెలుసన్నారు. యాదగిరిగుట్ట అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడతాయనే ఉద్దేశంతో.. మెజార్టీ సభ్యులు లేకున్నా తనతో పాటు మరో ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటేసి బీఆర్ఎస్ కౌన్సిలర్ చైర్ పర్సన్ అయ్యేలా కృషి చేశామని గుర్తుచేశారు. కానీ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీ మారిన కొందరు 'అన్నం పెట్టినోళ్లకు సున్నం పెట్టినట్లు'గా మాట్లాడుతున్నారని.. అట్టి వ్యాఖ్యలను వాళ్ల నైతికతకే వదిలేస్తున్నామని పేర్కొన్నారు. ఇక పదవీకాలం ముగిసినా ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయాలని మాజీలైన బీఆర్ఎస్ కౌన్సిలర్లకు సూచించారు. అనంతరం పదవీకాలం ముగిసిన కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లు కాటం రాజు, దండెబోయిన అనిల్, ఆవుల మమత సాయి, సురేందర్, మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ బాబా, గోర్ల పద్మ, మండల నాయకులు ఆరె శ్రీధర్ గౌడ్, పాండవుల భాస్కర్ గౌడ్, యాకూబ్ తదితరులు ఉన్నారు.





# విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలి

**చౌటుప్పల్ ఆర్డీవోకు వినతి**

**విద్యాశాఖ మంత్రిని నియమించి రానున్న బడ్జెట్లో విద్యాశాఖకు 20 శాతం నిధులు కేటాయించాలి : పల్లగొర్ల మోదీరాందేవ్**



**చౌటుప్పల్, రోమింగ్ న్యూస్:** చౌటుప్పల్ విద్యార్థులకు రావలసిన ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి కి వినతిపత్రం బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్, ఎడ్ల మహాలింగం అందించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ₹7500 కోట్ల బకాయిలను విడుదల చేయాలని ఇప్పుడు ఇస్తున్న స్కాలర్షిప్ 5000 నుండి 20 వేలకు పెంచాలి చదువుకునే ప్రతి విద్యార్థికి ప్రభుత్వమే పూర్తి ఫీజు భరించాలి విద్యాశాఖ మంత్రిని నియమించి రానున్న 2025 బడ్జెట్లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి విద్యార్థులకు ఇస్తా అన్న ఐదు లక్షల భరోసా కార్డు ఇవ్వాలి యువతలకు స్కూటీలు ఇవ్వాలి సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు మెస్ చార్జీలు 3500 పెంచాలి సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి స్కాలర్షిప్ అందకపోవడంతో విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉన్నది ఇంటర్ విద్యార్థులకు ఇస్తున్న రియంబర్స్మెంట్ 1700 నుండి 10000 పెంచాలి రాష్ట్రంలో ఖాళీ ఉన్న రెండు లక్షల 50 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలి నిరుద్యోగలకు 3000ల నిరుద్యోగభృతి ఇవ్వాలి ప్రభుత్వ మేనిఫెస్టోల ఇచ్చిన అన్ని హామీల అమలు చెయ్యాలి విద్యార్థుల సమస్యలపై ఐఏఎస్ కమిటిని ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని ఆర్డీవో గారిని కోరడం జరిగింది ఈ సమావేశంలో ఎడ్ల మహాలింగం, అశోక్, సందీప్ పాల్గొన్నారు

# వక్ఫ్ సవరణ బిల్లుకు జెపిసి ఆమోదం

## మొత్తం 14 సవరణలను ఆమోదించిన కమిటీ

న్యూఢిల్లీ,జనవరి 27 : వక్ఫ్ బోర్డ్ అధికారాలకు కోత పెడుతూ మోదీ సర్కార్ తీసుకొచ్చిన 'వక్ఫ్ సవరణ బిల్లు'కు జెపిసి ఆమోదం లభించింది. ఈ బిల్లు పరిశీలన కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ సమావేశమైన పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది. అధికార బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సభ్యులు ప్రతిపాదించిన మొత్తం 14 సవరణలను జేపీసీ ఆమోదించింది. విపక్షాలు సూచించిన మార్పులు తిరస్కరణకు గురయ్యాయి. వక్ఫ్ సవరణ బిల్లు పరిశీలన కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది. విపక్ష ఎంపీలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులు సూచించగా.. 14 సవరణలను కమిటీ ఆమోదించినట్లు ప్యానెల్ ఛైర్మన్ జగదాంబిక పాల్ వెల్లడించారు. ఈ సవరణలు చట్టాన్ని మరింత శక్తివంతంగా మారుస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కమిటీలో ఎన్డీయే సభ్యులు సూచించిన మార్పులకు ఆమోదం లభించగా.. విపక్షాలు

సూచించిన మార్పులు తిరస్కరణకు గురయ్యాయి. వీటిపై ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో కమిటీ పనిచేయలేదని విపక్ష సభ్యులు ఆరోపించారు. మొత్తంగా జేపీసీ సూచించిన 14 ప్రతిపాదనల ఆమోదానికి సంబంధించి జనవరి 29న ఓటింగ్ జరగనుంది. జనవరి 31న తుది నివేదిక లోక్‌సభకు అందజేయనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం.

# విద్యార్థుల అపహరణ కలకలం

కర్నూలు,జనవరి 27 : కర్నూలు జిల్లా సి.బెళగల్‌లో గురుకుల పాఠశాల విద్యార్థులను దుండగులు అపహరించారు. భోజన విరామ సమయంలో ఆడుకుంటున్న 6, 7 తరగతి విద్యార్థులు సూర్యతేజ, నవీన్‌ను కిడ్నాప్ చేశారు. జీపులో వచ్చి వారిని ఎత్తుకెళ్లిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అపహరణకు గురైన ఇద్దరు విద్యార్థులూ బంధువులేనని పోలీసులు గుర్తించారు. కుటుంబ కలహాలతోనే చిన్నారులను కిడ్నాప్ చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

అపహరణకు గురైన సూర్యతేజ, నవీన్ క్షేమంగా బయటపడ్డారు. తీవ్ర గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు వీరిని ఎమ్మిగనూరులో గుర్తించారు.

# 78 స్వాతంత్ర్య భారతంలో ఇంకా కనీస వసతులు కరువు

## మారుమూల గ్రామాల్లో తాగునీటికి అవస్థలు

న్యూఢిల్లీ, జనవరి 27 : మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి సుమారుగా 78 ఏళ్లు పూ-ర్తయ్యింది. ఈ ఎనిమిది దశాబ్దాల్లో దేశంలో ఎంతో అభివృద్ధి జరిగింది. దాదాపు అన్ని రంగాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. అయితే వివిధ రాష్ట్రాల్లోని కొన్ని మారుమూల గ్రామాలకు మాత్రం ఇంకా అన్ని రకాల అభివృద్ధి ఫలాలు అందలేదు. ఇప్పటికీ సరైన రవాణా సౌకర్యం, తాగునీటి వసతి లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన చిల్కపల్లి గ్రామం కూడా ఆ కోవకు చెందినదే. చిల్కపల్లి గ్రామానికి రవాణా, తాగునీటి సంగతి దేవుడెరుగు.. ఇప్పటిదాకా కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏళ్ల తర్వాత ఇప్పుడు ఆ గ్రామం విద్యుత్ వెలుగులకు నోచుకున్నది. బీజాపూర్ జిల్లా కలెక్టర్ సంబిట్ మిశ్రా ఈ నెల 23న చిల్కపల్లి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. దాంతో చిల్కపల్లి గ్రామ ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. చాన్నాళ్ల తర్వాత తమ ఇళ్లలో విద్యుత్ వెలుగులను చూసుకుని సరికొత్త అనుభూతి చెందుతున్నారు. జనవరి 23 నుంచి చిల్కపల్లి గ్రామానికి విద్యుత్ వెలుగులు మొదలయ్యాయని సంబిట్ మిశ్రా చెప్పారు. నియాద్ నెల్నార్ పథకం కింద ఆ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ పథకం కింద విద్యుత్ సౌకర్యం పొందిన ఆరో గ్రామం చిల్కపల్లి అని మిశ్రా వెల్లడించారు.

# గుట్టలో రామలింగేశ్వరునికి రుద్రాభిషేకం





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కొండపైన వేంచేసి ఉన్న శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారికి సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. మహాదేవునికి నమ్మక, చమకములతో అర్చన జరిపారు. మహాదేవునికి ఇష్టమైన బిల్వపత్రాలతో అర్చన చేశారు. శివాలయం అర్చకులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆలయ ఇన్చార్జి చారి కార్యక్రమాలను పర్యవేక్షించారు. కొండపైన ఆర్జిత పూజలపై కోలాహలం కొనసాగింది. శ్రీవారి నిత్య కళ్యాణం సుదర్శన నరసింహం జోడు సేవలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి ఖజానాకు సోమవారం రూ:- 36,46,685 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎన్. భాస్కరరావు తెలిపారు. శ్రీ స్వామి వారికి 760 మందిభక్తులు తలనీలాలు సమర్పించారన్నారు.

**విభాగాల వారీగా ఆదాయం వివరాలు**

కళ్యాణ కట్ట 38,000/-
ప్రధాన బుకింగ్ 80,300/
కైంకర్యములు 300/-
సుప్రభాతం 6300/-
బ్రేక్ దర్శనం 51,000/-
వ్రతాలు 72,800/-
వాహన పూజలు 11,100/-
%ఎక్రూ% దర్శనం 1,20,000/-
,ప్రచారశాఖ 27,250/-
పాతగుట్ట 10,350/-
కొండపైకి వాహన ప్రవేశం 2,50,000/-
యాదఋషి నిలయం 44,800/-
సువర్ణ పుష్పార్చన 30,800/-
శివాలయం 8,200/-
శాశ్వత పూజలు 25,000/-
పుష్కరిణ 1,050/-
ప్రసాదవిక్రయం 8,00,770/-
లాకర్స్ 180/-
అన్నదానం 7,321/-
విమాన గోపురం 5,13,464/-
లీజెస్ 15,47,700/-

# రాజకీయంగా వైరుధ్యంతో పార్టీలో అసంతృప్తి

## జాడ లేని మార్కెట్ కమిటీల నియామకం

జగిత్యాల,జనవరి 27 : నేతల మధ్య సయోధ్య లేకపోవడంతో పనులు సాగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీనికితోడు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి. ఎమ్మెల్యే సంజయ్‌కు పొసగకపోవడంతో పార్టీలో ఏకాభిప్రయం కానరావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఏడాది గడిచినా జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టు భర్తీకాకపోవడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఇష్టారాజ్యంగా పాలన సాగుతుండడంతో అటు ప్రజలు, ఇటు అధికారులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. జగిత్యాల నియోజకవర్గ పరిధిలో రెండు మార్కెట్ కమిటీలు ఉండగా, రెండింటికి పాలకవర్గాలను ఇంత వరకు నియమించలేదు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడంతో రాజకీయాలన్నీ తారుమారు అయిపోయాయి. ఎమ్మెల్సీగా కొనసాగుతున్న జీవన్‌రెడ్డి జగిత్యాల, రాయికల్ మార్కెట్ కమిటీ చైర్మన్లతో పాటు, పాలకవర్గానికి కొందరు కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకుల పేర్లను ఏడాది క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మరికొందరి పేర్లను ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీంతో చిక్కుల్లో పడ్డ అధికారులు ఎవరినీ ఎంపిక చేయకుండా వదిలిపెట్టారు. వడ్ల కొనుగోలుకు సంబంధించి రెండు సీజన్లు పూర్తయి, మూడో సీజన్ ప్రారంభమైనా ఇంకా కమిటీల ఏర్పాటు జరగకపోవడంపై రైతులు, కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎంపిక విషయంలోనూ తీవ్రమైన జాప్యం నెలకొన్నది. జిల్లాస్థాయి పోస్టు కావడంతో మూడు నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పదవిని ఆశిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ధర్మపురి నియోజకవర్గానికి చెందిన బ్రాహ్మణ కమ్యూనిటీకి చెందిన ఒక సీనియర్ నాయకుడికి చైర్మన్ పోస్టు కట్టబెట్టాలని ప్రభుత్వ విప్ ప్రయత్నించారు. అలాగే, కోరుట్ల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు సైతం అదే పదవిని ఆశిస్తూ వచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని దళిత వర్గానికి చెందిన సీనియర్ కార్యకర్తకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అయితే, సదరు దళిత నాయకుడికి పదవి ఇవ్వడం ఇష్టంలేని ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం నుంచి కొనసాగుతున్న మరో నాయకుడి పేరును ప్రతిపాదిస్తూ సిఫారస్ చేశారు. దీంతో చైర్మన్ ఎంపికలోనూ ప్రతిష్టంభన ఏర్పడింది. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి భర్తీ విషయంలో చక్రం తిప్పిన జగిత్యాల ఎమ్మెల్యే తన రాజకీయ ప్రత్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిర్ణయాన్ని విజయవంతంగా అడ్డుకున్నట్లు

తెలుస్తోంది. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జితో ఉన్న బంధుత్వాన్ని ఆసరాగా చేసుకొని, చొప్పదండి ఎమ్మెల్యే, ధర్మపురి ఎమ్మెల్యేను ఒప్పించి, ఎమ్మెల్యే ప్రతిపాదించిన దళిత వర్గానికి చెందిన నాయకుడికి కాకుండా, తన సామాజిక వర్గమైన కోరుట్ల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడి పేరును ప్రతిపాదించినట్లుగా సమాచారం.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
28 జనవరి
2025




# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

**మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ మంజూరు**

**10 నెలలు జైలులో గడిపిన తిరుపతన్న**





తిరుపతన్న

హైదరాబాద్,జనవరి 27 : తెలంగాణలో అత్యంత సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇన్నాళ్లు అరెస్టులు, దర్యాప్తులు, విచారణల తర్వాత- ఈ కేసులో ఫస్ట్ బెయిల్ వచ్చింది. మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ లభించింది. షరతులతో కూడిన బెయిల్ ను సుప్రీంకోర్టు మంజూరు చేసింది. ట్యాపింగ్ కేసులో 10 నెలలుగా జైల్లో గడిపారు మాజీ పోలీస్ అధికారి తిరుపతన్న బెయిల్ అనంతరం విడుదల కానున్నారు. రాజకీయ నేతల ఆదేశాల మేరకు అందరి ఫోన్లను ట్యాప్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ఇందులో ఉన్నాయని మాజీ ఏఎస్పీ తిరుపతన్నపై ఆరోపణలు ఉన్నాయి. ఆధారాలు చెరిపేయడంలోనూ ఆయనదే కీలక పాత్ర అనే అభియోగాలు కూడా ఉన్నాయి. 2023 డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు రాగానే ఆధారాలు ధ్వంసం చేసిట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో ఆరెస్టైన తిరుపతన్న పది నెలలుగా జైలులో ఉండగా.. తాజాగా ఆయనకు బెయిల్ ఇచ్చింది సుప్రీం కోర్ట్. వాస్తవానికి ఫోన్ ట్యాపింగ్ కేస్ లో అరెస్ట్ అయ్యిన వారిలో మొదటి వ్యక్తి తిరుపతన్న.. ఫోన్ ట్యాపింగ్ కేసులో నలుగురిని గత ఏడాదిలో హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.. అడిషనల్ ఎస్పీ ప్రణీత్ రావ్, అడిషనల్ ఎస్పీ భుజంగ రావ్, అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావ్ లను పోలీసులు అరెస్ట్ చేసారు. దాదాపు 10 నెలలకు పైగా జైల్ లోనే ఉన్నారు. బయటికి వచ్చేందుకు అనేక సార్లు బెయిల్ పిటిషన్ లు దాఖలు చేసినప్పటికీ రిజెక్ట్ అవుతూ వచ్చాయి. హై కోర్టులో పలుమార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ ఇక్కడ ఊరట లభించలేదు. తాజాగా సుప్రీం కోర్టును ఆశ్రయించగా అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తిరుపతన్నను గత ఏడాది 24న ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అదే సమయంలో మరో అడిషనల్ ఎస్పీ భుజంగరావు ఉన్న సైతం పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ అనేకసార్లు లోయర్ కోర్టుతో పాటు హైకోర్టులోను బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు ఎవరికీ పూర్తిస్థాయిలో బెయిల్ మంజూరు కాలేదు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై దేశ వ్యాప్తంగా చర్చ జరిగింది. రాజకీయ ప్రత్యర్థులు, హైకోర్టు జడ్జిలు, జర్నలిస్టుల ఫోన్లను ట్యాప్ చేసినట్టు పోలీసులు ఆరోపణలు మోపారు.. వీటికి సంబంధించి కోర్టులో ఇంకా కేసులు నడుస్తూనే ఉన్నాయి. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ పొందిన మొదటి వ్యక్తి తిరుపతన్న.. సుప్రీం కోర్టు ఆదేశాలతో జైలు నుంచి విడుదల కానున్నారు.

# సూర్యాపేటలో మరో పరువు హత్య



సూర్యాపేట,జనవరి 27 : సూర్యాపేటలోని మామిల్లగడ్డకు చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి హత్యకు హత్యకు గురయ్యాడు. పిల్లలమర్రి సమీపంలోని మూసీ కాలవ కట్టపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పిల్లల మర్రికి చెందిన నవీన్, కృష్ణ స్నేహితులు. తరచూ పిల్లలమర్రిలోని నవీన్ ఇంటికి వస్తూ పోతున్న కృష్ణ నవీన్ సోదరి భార్గవిని ప్రేమించాడు. వీరి ప్రేమను భార్గవి తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో ఆరు నెలల క్రితం భార్గవిని కృష్ణ కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్గవి, కృష్ణ ఇద్దరూ సూర్యాపేటలో కాపురం పెట్టాడు. ప్రేమ పెళ్లిని నిరాకరించిన భార్గవి తల్లిదండ్రులు వారిని విడదీసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కులాంతర వివాహం చేసుకున్న బంటిపై భార్గవి సోదరుడు నవీన్ కక్ష పెంచుకున్నాడు. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో మహేష్ అనే మిత్రుడి నుంచి ఫోన్ కాల్ అందుకున్న కృష్ణ భార్యకు ఫోన్ ఇచ్చి బయటకు వెళ్లాడు. రాత్రి లేట్ అయినా కృష్ణ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. సూర్యాపేట జనగాం క్రాస్ రోడ్ నుండి పిల్లల మర్రికి వెళ్లే మూసి కెనాల్ కట్టపై కృష్ణ మృతదేహం పడి ఉంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కృష్ణ బంధువులు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. దుండగులు మృతుడి మెడకు ఉరి వేసి చంపినట్లు గుర్తులు కన్పిస్తున్నాయి. మృతుడి ఒంటిపై కమిలిన గాయాలున్నాయి. నిందితులను గుర్తించేందుకు పోలీసులు గాలిస్తున్నారు. భార్గవి సోదరుడు కోట్ల నవీన్ హత్యకు పాల్పడ్డట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు కృష్ణ పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ హత్యకు ప్రేమ వివాహమే కారణమా, లేక పాత కక్షలే కారణమా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# హుస్సేన్ సాగర్ ఘటనలో ఆచూకీలేని యువకుడు

**పోలీసుల గాలింపులో కానరాని ఆనవాళ్లు**



హైదరాబాద్,జనవరి 27 : హుస్సేన్‌సాగర్ లో రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం ఘటనలో ఓ యువకుడి ఆచూకీ తెలియడంలేదు. అగ్ని ప్రమాదంలో రెండు బోట్లు దగ్ధమవగా ఒక్క బోటులో ఫ్రండ్స్‌తో వెళ్లిన అజయ్ (21) అనే యువకుడు కనిపించడం లేదు. అజయ్‌తోపాటు వెళ్లిన ఫ్రండ్స్ మాత్రం సురక్షితంగా బయటపడ్డారు. అజయ్ ఏ ఆస్పత్రిలోనూ లేదని పోలీసులు చెబుతుండడంతో అతని కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. అజయ్ ఫ్రండ్స్ నుంచి లేక్ పోలీస్ స్టేషన్ పోలీసులు వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో లేక పోలీసులు పడవలతో సాగరన్ చుట్టే గాలించినా ఫలితం లేకుండా పోయింది. కాగా భరతమాత పౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద 'భరతమాత మహా హారతి' కార్యక్రమం నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. రెండు బోట్లలో బాణసంచా పేల్చడానికి కొందరు యువకులు రెండు బోట్లలో హుస్సేన్‌సాగర్ మధ్యలోకి వెళ్లారు. బాణసంచా కాలుస్తుండగా నిప్పురవ్వలు ఎగిసిపడి అగ్నిప్రమాదం సంభవించింది. నిప్పురవ్వలు తిరిగి అవే బోట్లలో ఉంచిన బాణసంచాపై పడటంతో బోట్లకు మంటలు వ్యాపించాయి. దీంతో రెండు బోట్లు దగ్ధం కాగా.. అందులో ఉన్నవారు స్వల్పగాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. వారిలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. నాగారానికి చెందిన అజయ్ తన కొలిగ్స్‌తో కలిసి హుస్సేన్‌సాగర్‌కు వచ్చాడు. అయితే బోట్స్‌లో అజయ్ ఉన్నట్లు ఫ్రండ్స్ చెబుతున్నారు. బోట్‌లో అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే అందులో ఉన్నవారు అందరూ నీటిలోకి దూకారు. అదే సమయంలో అజయ్‌తోపాటు అతని స్నేహితులు ఉన్నారు. వారు సురక్షితంగా బయటపడ్డారు. అయితే అజయ్ ఆచూకీ మాత్రం లభించలేదు. దీంతో అతని కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అజయ్ ఎక్కడా ఏ ఆస్పత్రిలో జాయిన్ కాలేదని.. ఇదే విషయాన్ని పోలీసులు కూడా స్పష్టం చేశారు. అజయ్ అనే పేరుతో ఎవరూ ఆస్పత్రిలో జాయిన్ కాలేదని, క్షతగాత్రుల వివరాల్లో అజయ్ పేరు లేదని పోలీసులు తెలిపారు. దీంతో అజయ్ ఏమయ్యాడనే ఆందోళన కుటుంబసభ్యుల్లో నెలకొంది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆదివారం రాత్రి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన 'భరతమాత మహా హారతి' కార్యక్రమంలో ఆయనతోపాటు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అయితే కార్యక్రమం పూర్తయ్యాక పీపుల్స్ ఎ÷-లాజా సమీపంలో వేదిక వెనుక భాగంలో బాణసంచా కాల్చేందుకు పర్యాటక శాఖకు చెందిన రెండు బోట్లలో సామగ్రిని హుస్సేన్‌సాగర్ మధ్యలోకి తీసుకెళ్లారు. బోటులో డ్రైవర్, వాల్టర్, సిబ్బంది, బాణసంచా కాల్చే ఐదుగురు నిపుణులతోపాటు 15 మంది బీజేపీ కార్యకర్తలు ఉన్నారు. అయితే బాణసంచా కాల్చే క్రమంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో

బోట్లలో ఉన్న కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు నీళ్లలోకి దూకారు. రంగంలోకి దిగిన అధికారులు.. జెట్టీలో మంటలను అదుపులోకి తెచ్చే పరికరాలు లేకపోవడంతో వారిని స్పీడ్‌బోట్‌లో బయటకు తీసుకువచ్చారు. అయితే ప్రమాదంలో బాణసంచా కాల్చే నిపుణుడు గణపతి (22)కి తీవ్ర గాయాలయ్యాయి. ఇతనితోపాటు ప్రమాదంలో గాయపడిన చింతల కృష్ణ (47), కరీంనగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి సాయిచంద్‌ను సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గణపతి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా, సీతాఫల్‌మండికి చెందిన బీజేపీ కార్యకర్తలు సునీల్, ప్రణీత్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, కాలిపోయిన లూంబిని బోట్ విలువ రూ.12 లక్షలు ఉంటుందని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

# రైతుబంధును ఎగ్గొట్టాడని రైతుల శాపనాలు

**సీఎం రేవంత్‌పై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**పథకాలపై నిలదీతలతో సమాధానాలు చెప్పలేకపోతున్నాం**

**రేవంత్ కంటే కేసీఆర్ పాలనే బాగుంది**

**వైరల్ అవుతున్న రాజగోపాల్‌రెడ్డి వీడియో**



మునుగోడు,జనవరి 27 : కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తమ ప్రభుత్వంపై అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతు బంధును ఎగ్గొట్టామని, రైతు భరోసాలో ఇచ్చిన హామీ మేరకు కాకుండా కొంత నగదు తగ్గించామని, గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టుకుంటున్నారని రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు పథకాలు (ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు) ప్రారంభోత్సవంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మసీదుగూడెంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ 'తమకు రైతు రుణమాఫీ కాలేదని, రైతుబంధు రాలేదని గ్రామాల్లోని ప్రజలు ప్రభుత్వాన్ని తిరుడున్నారు. అంతా కేసీఆర్ పాలనే బాగుండేదని మెచ్చుకుంటున్నారు' అని అన్నారు. 'రైతుబంధును మధ్యలో ఒకసారి ఎగ్గొట్టినం. రైతు భరోసాలో ఇచ్చిన హామీ మేరకు కాకుండా, కొంత నగదును తగ్గించినం. అందుకే గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని తిడుతున్నారు. అదే రూ.2 లక్షల రుణ మాఫీ అయినోల్లు మాత్రం జేబులో వేసుకొని సప్పుడు చేస్తలేరు. ఎన్ని అప్పులు చేసైనా పథకాలు అమలు చేస్తాం' అని అన్నారు. ఇందుకు సంబంధించిన ఓ ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సొంత పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపైనే రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేయడంతో.. ప్రతిపక్షాలు ఆ వ్యాఖ్యలను ఆయుధంగా చేసుకుంటున్నాయి. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్? ప్రభుత్వం పూర్తిగా ఫెయిలైందని, ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని పేర్కొంటున్నారు. ఏ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు కూల్చేస్తారని బీఆర్ఎస్, బీజేపీ నేతలు పేర్కొంటున్నారు.

# ఢిల్లీలో వేడెక్కిన రాజకీయాలు

## రెండు మేనిఫెస్టోను విడుదల చేసిన ఆమ్‌ఆద్మీ పార్టీ

ముంబై,జనవరి27 :ఢిల్లీలో రాజకీయాలు వేడెక్కాయి. అసెంబ్లీ ఎన్నికలకు మరో తొమ్మిది రోజులే సమయం ఉండటంతో అధికార, విపక్ష పార్టీల నేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇక అధికార ఆమ్ ఆద్మీ పార్టీ రెండో మేనిఫెస్టోను విడుదల చేసింది. ఇప్పటికే మధ్యతరగతి ప్రజల కోసం ఆప్ మేనిఫెస్టో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా 15 గ్యారెంటీలతో ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సోమవారం కొత్త మేనిఫెస్టో రిలీజ్ చేశారు. వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో సంక్షేమ పథకాలు, ఉపాధి కల్పన, ప్రజాసేవల్లో మెరుగుదల వంటి 15 కీలక వాగ్దానాలు చేశారు. ఇప్పటికే అమల్లో ఉన్న పథకాలను కొనసాగిస్తామని వెల్లడించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే విద్యార్థులకు ఉచిత బస్? సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. మెట్రో ఛార్జీల్లో 50శాతం రాయితీ ఇస్తామని హామీ ఇచ్చారు. 15 పోల్ గ్యారెంటీలు ఇవే..

ఉపాధి హామీ.. ప్రతి మహిళకు రూ.2,100.. నేరుగా బ్యాంకు ఖాతాకే నగదు జమ. సంజీవని యోజన పథకం కింద 60 ఏళ్లు పైబడిన వారికి ఉచిత చికిత్స (ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య చికిత్స), 24 గంటల నీటి సరఫరా, యూరప్ తరహాలో రోడ్లు, యమునా నదిని శుభ్రం చేస్తాం, డాక్టర్ అంబేద్కర్ స్కాలర్‌షిప్ పథకం, విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం, ఢిల్లీ మెట్రోలో 50 శాతం రాయితీ

అర్చకులు, గ్రంథులకు ఒక్కొక్కరికి రూ.18వేలు, కౌలుదారులకు ఉచిత విద్యుత్, నీరు మురుగునీటి వ్యవస్థలను మెరుగుపరచటం, రేషన్ కార్డుల మంజూరు, ఆటో, టాక్సీ, ఇ-రిక్షా డ్రైవర్లకు జీవిత బీమా, వారి కుమార్తె వివాహానికి రూ. 1 లక్ష సాయం, పిల్లలకు ఉచిత కోచింగ్, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్‌కు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పథకాలు ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మధ్యతరగతి ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి అరవింద్ కేజ్రీవాల్ ఏడు డిమాండ్లు లేవనెత్తారు. 'విద్యా బడ్జెట్‌ను రెండు నుంచి పది శాతానికి పెంచాలి, ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలి. మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా ఉన్నత విద్యకు సబ్సిడీలు, స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి. ఆరోగ్య బడ్జెట్‌ను పది శాతానికి పెంచాలి, ఆరోగ్య బీమాపై పన్ను తొలగించాలి. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ. 7 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచాలి. నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తొలగించాలి. సీనియర్ సిటిజన్లకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టాలి.

# కిడ్నీ రాకెట్ కేసులో కీలక విషయాలు

## ఇప్పటి వరకు 9మందిని అరెస్టు చేసిన పోలీసులు

హైదరాబాద్,జనవరి 27 : తెలంగాణ వ్యాప్తంగా సంచలనం రేపిన కిడ్నీ రాకెట్ కేసులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఎల్బీనగర్ వేదికగా అలకనంద హాస్పిటల్‌లో గుట్టుగా సాగుతున్న కిడ్నీ మార్పిడి రాకెట్ గుట్టు తేల్చారు పోలీసులు. ఈ కేసులో ఇప్పటివరకు 9 మందిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో చాలామంది డాక్టర్లు కూడా ఉన్నారు. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇక్కడ ఎలాంటి ఇన్కమ్ లేకపోవడంతో కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ చేసి డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా డాక్టర్ అవినాష్, డాక్టర్ సుమంత్ ఇద్దరూ కలిసి భారీగా కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆపరేషన్లు చేశారు. మొదట డా. అవినాష్ సైదాబాద్‌లో జననీ హాస్పిటల్‌ను స్థాపించాడు. అందులో ఆయనకి ఆశించినంత సక్సెస్ రాకపోవడంతో 2022లో హాస్పిటల్ మూసేశాడు. తర్వాత డాక్టర్ సుమంత్ పరిచయం కావడంతో ఇద్దరు కలిసి సరూర్‌నగర్‌లో అలకనంద హాస్పిటల్ స్థాపించారు. ఈ హాస్పిటల్‌లో గుట్టు చప్పుడు కాకుండా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించేవారు. ఆరు నెలల వ్యవధిలో సుమారు 20కి పైగా కిడ్నీ ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్ల నిర్వహణ కోసం ఇతర రాష్ట్రాల నుంచి సర్జరీ నిర్వహించే డాక్టర్లను అలకనంద హాస్పిటల్‌కు రప్పించారు.. సర్జరీ చేసే వైద్యుల్లో కీలకంగా తమిళనాడుకు చెందిన డాక్టర్ రాజశేఖర్‌తో పాటు జమ్ము కాశ్మీర్‌కు చెందిన డాక్టర్ సాహెబ్ ఉన్నారు. కిడ్నీలను డొనేట్ చేసేందుకు ఎక్కువగా పేద కుటుంబానికి చెందిన వారే ఆసక్తి చూపిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కిడ్నీ అమ్మితే లక్షల రూపాయలు వస్తాయని ఆశపడి ఎలాంటి నిబంధనలు లేకున్నా సరే ఈ తరహాలో ప్లాన్ చేస్తున్నారు. ఒక్కో కిడ్నీ ఆపరేషన్‌కు దళారులు 60 లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. వీటిలో కిడ్నీ డొనేట్ చేస్తున్న వ్యక్తికి కేవలం 5 లక్షల రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. కిడ్నీ ఆపరేషన్ చేసిన వైద్యుడికి ఒక్కో డాక్టర్‌కు 10 లక్షల రూపాయల చొప్పున ఇస్తున్నారు. మధ్యవర్తులు, ఏజెంట్లకి ఒక్కో ఆపరేషన్‌కు 30 వేల రూపాయలు ఇస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో 9 మందిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 15 మంది నిందితులను పోలీసులు గుర్తించారు. వీరిలో మరో ఆరుగురు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. మెయిన్ సర్జరీ చేసిన ఇతర డాక్టర్ల కోసం రాచకొండ పోలీసులు గాలిస్తున్నారు. వీరిని పట్టుకునేందుకు చెన్నైతోపాటు జమ్ము కాశ్మీర్ కు ఎస్ఓటి బృందాలు వెళ్లినట్టు సమాచారం.

# ప్రయాగ్ రాజ్‌లో అమిత్‌షాకు ఘన స్వాగతం

**స్వాగతం పలికిన సిఎం యోగి తదితరులు**

**కుంభమేళాలలో స్నానమాచరించిన అమిత్ షా**



**ప్రయాగ్‌రాజ్,జనవరి 27:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాకు భారీగా భక్తులు క్యూ కడుతున్నారు. సాధారణ ప్రజలతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు కూడా త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. తాజాగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈ కుంభమేళాలో పాల్గొన్నారు. గంగ, యమున, సరస్వతి నదీ సంగమం వద్ద పుణ్యస్నానం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, యోగా గురు బాబారామ్‌దేవ్ కూడా పుణ్యస్నానమాచరించారు. పుణ్యస్నానం కోసం ప్రత్యేక విమానంలో ప్రయాగ్‌రాజ్ చేరుకున్న అమిత్ షాకు సిఎంయోగి ఆదిత్యనాథ్, ఆయన మంత్రిర్గ సహచరులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక బిజెపి నేతలు కూడా అమిత్ షాను స్వాగతించారు. మరోవైపు జనవరి 13న ప్రారంభమైన మహా కుంభమేళా వైభవోపేతంగా కొనసాగుతోంది. ఫిబ్రవరి 26 వరకు మొత్తంగా 45 రోజుల పాటు జరగనుంది. విదేశాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో పోటెత్తున్నారు. ఈనెల 29న మౌని అమావాస్య కావడంతో 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు(అమృత స్నానం) ఆచరించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం వల్ల 12 లక్షల మందికి తాత్కాలిక ఉపాధి లభించిందని అంచనా. తాత్కాలిక వైద్య శిబిరాలతో 1.5 లక్షల మంది నర్సులు, పారామెడికల్స్, ఇతర వైద్య సిబ్బందికి అవకాశాలు లభించాయి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
28 జనవరి
2025



# కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో తిరుగుబాటు

**గ్రామసభల్లో నిలదీసినా కప్పిపుచ్చుకునే యత్నం**

**హామీల అమలుకు ఏడాదైనా పూర్తి చేయని వైనం**

**మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు**



నిజామాబాద్,జనవరి 27 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై గ్రామసభల సాక్షిగా కాంగ్రెస్ సర్కారును ప్రజలు అనేకచోట్ల నిలదీసారని, ప్రజలకు సమాధానం చెప్పే స్థితిలో పాలకులు లేరని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డుల సర్కస్ ఫీట్లు, లోకల్ బాడీ ఓట్ల కోసం కాంగ్రెస్ పడుతున్న పాట్లు అని ఎద్దేవా చేశారు. కేవలం స్థానిక ఎన్నికల్లో పట్టుకోసం చేస్తున్న కసరత్తు తప్ప ప్రజల మేలుకోరి చేసే పనులు మాత్రం కావన్నారు. అమలు కాని ఆరు గ్యారంటీలే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది అని పేర్కొన్నారు. గ్రామసభల్లో ప్రజలు తిరగబడు తున్నారని తెలిసి కూడా బుకాయించారని అన్నారు. ఏడాది దాటినా ఆరు గ్యారంటీలకే గతి లేదని, ఇక ఇండ్లు, రేషన్ కార్డు ఇస్తామంటే నమ్మేదెవరని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల మంజూరు పేరుతో నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రజల తిరుగుబాటు కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనకు నిలువెత్తు

నిదర్శనమని వేముల పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలకే ఉప్పు పాతరేసి కొత్తగా ఈ డ్రామాలేమిటని ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. అక్కడక్కడ హామీల అమలుపై ఎమ్మెల్యేలను ప్రజలు నిలబెట్టి అడిగారని అన్నారు. ఇండ్లు ఎప్పుడు కట్టిస్తారంటూ మహిళలు తిరగబడ్డారని గుర్తుచేశారు. అబద్దాలు చెబుతూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలవాలని మోసాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ జీరో కాక తప్పదన్నారు. గ్రామసభల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే లేరని, మంత్రులు పత్తా లేకుండా పోయారని, ఎమ్మెల్యేలను గ్రామాలకు రానివ్వడం లేదన్నారు. హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరగలేరన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై ప్రజలు తిరగబడ్డా రని వేముల అన్నారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలు పుట్టి పెరిగిన గ్రామాల్లో ఎన్నికల హామీలు నూరు శాతం అమలు జరిగాయని నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని, లేకుంటే కాంగ్రెస్ నేతలు రాజకీయాల నుం చి తప్పుకుంటారా అని సవాల్ విసిరారు. హామీల అమలులో ప్రజలకు సర్కారు వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలను మండలానికి ఒక గ్రామం చొప్పున, జిల్లాలోని 35 మండలాల్లో కేవలం 35 గ్రామాల్లో

ప్రారంభించారని తెలిపారు. ఏ ఊరికైనా వెళ్లి, నూరుశాతం హామీలు అమలవుతున్నాయని ప్రజలు చెబితే రాజకీయాలను వదిలేస్తానని, లేకుంటే కాంగ్రెస్ నాయకులు, రాజకీయాలు వదిలేసి ముక్కు నేలకు రాస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలవి తుగ్లక్ రాజకీయాలని ఆయ న విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల వీరంగాలు, అక్రమ కేసులకు బీఆర్ఎస్ భయపడే రకం కాదన్నారు. తాము పోరాడుతూనే ఉంటామని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూనే ఉంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రజలను మోసగిస్తున్నదని, అందుకే ఎక్కడ చూసినా జనాగ్రహజ్వాలలే కనిపిస్తున్నాయన్నారు. ఇది ప్రజాపాలన కాదని, తుగ్లక్ పాలన అని విమర్శించారు. ఎన్నికల హామీల అమలులో ఘోర వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికే రోజుకో నాటకం వేస్తున్నారని మండిపడ్డారు. పథకాల అమలుకు సంక్రాంతి పోయిందని, ఇప్పుడు శివరాత్రికి అంటున్నారని ఎద్దేవా చేశారు.



# మావోయిస్టులకు కాలం చెల్లిందా?

మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇటీవలి ఎన్‌కౌంటర్లలో వరుసబెట్టి నేతలు నేలకు ఒరిగారు. కేంద్రం కూడా మావోల అణచివేతకు పకడ్బందీ వ్యూహంతో అడుగులు వేస్తోంది. ప్రజల్లో వారికి స్థానం లేకపోవడం కూడా అణచివేతకు వ్యతిరేకత రావడం లేదు. ఎన్‌కౌంటర్లు జరిగినా పెద్దగా స్పందన రావడం లేదు. ఇకపో తేగతంలో తెలంగాణ, ఎపిల్లో వారి పట్టుబాగా ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఈ రెండు రాష్ట్రాల్లో పూర్తిగా తుడిచిపెట్టుకు పోయాయి. కేవలం ఛత్తీస్‌ఘడ్‌లో మా÷-తరమే కొంత ప్రభావం చూపుతున్నారు. అదికూడా అడవులకే పరిమితం కావడం, అడపాదడపా చిన్నాచితకగా కార్యక్రమాలు చేపట్టడం వంటివి చేస్తున్నారు. అడవిచుట్టూ ఉన్న గిరిజనులు కూడా తుపాకులకు భయపడి వారికి సలాం కొడుతున్నారు. అయితే ఎన్‌కౌంటర్లలో అందరూ నేలకు ఒరిగినా ఒక్క గిరిజనులు లేదా గిరిజన ప్రజలు కన్నీరు కార్చడం లేదు. కారణమేమంటే మావోలు ప్రజలతో సంబంధాలను వదులుకున్నారు.ప్రజలకు దూరంగా ఉంటున్నారు. ప్రజా ఉద్యమాలు ఆగిపయాయి. ప్రజల పక్షాన కొట్లాడడం లేదు. అందు కే మావోయిస్టు పార్టీ చివరి శ్వాస తీసుకుంటున్నది.నక్సలైట్ విముక్త భారత్ కోసం సా యుధ బలగాలు అత్యంత ధైర్యసాహసాలతో వందలాదిమంది మావోయిస్టులను నేల కూల్చారు. చత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ల్లోని అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తక్షణ స్పందన ఇది. మావోయిస్టులకు ఇక స్థానం లేదని, నక్సలిజం అంతరించిందని అన్నారు. తుపాకీతో రాజ్యం సాధించడం కల్ల అని తేలి పోయింది. భారత సైన్యం పెద్ద ఎత్తున విరుచుకుపడుతున్న నేపథ్యంలో మావోయిస్టులు భారీ మూల్యం చెల్లించుకోకతప్పడం లేదు. దేశ సైనిక సంపత్తి,టెక్నాలజీ, ఇతర వనరుల తో పోల్చితే మావోయిస్టు పార్టీకి ఉన్న బలం చాలా తక్కువని చెప్పక తప్పదు. అలాగే బ యట దేశాల నుంచి అందే సహాయం కూడా బాగా తగ్గిపోయింది. రిక్రూట్‌మెంట్ కూడా ఆగిపోయింది. యువత ఉద్యోగాన్వేషణలో పడింది. చచ్చ ఇసాధించేకన్నా బతికుండగానే సాధించుకోవాలన్న పట్టుదలతో యువత కెరీర్‌పై దృష్టి పెట్టింది. నాటి పీపుల్స్ వార్... మావోయిస్టు పార్టీగా మారాక 'సైనికీకరణ'కు ప్రాధాన్యం పెరిగింది. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ ఏర్పాటు, కంపెనీలు, బెటాలియన్లు, ప్లాటూన్లు పెరిగాయి. దట్టమైన అడవు ల్లో, సురక్షిత, దుర్భేద్యమైన ప్రాంతాల్లో మాత్రమే మావోయిస్టు గెరిల్లా ఆర్మీ సంచారం సా ధ్యం. అందుకే మావోయిస్టులు ఛత్తీస్ గఢ్‌లోని అబూజ్‌మడ్‌ను బేస్ క్యాంపుగా మార్చుకొని సాయుధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అబూజ్ మడ్ అడవుల్లోకి ప్రభుత్వం వరుస ఎన్‌కౌంటర్లతో ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం అట్టుడుకుతోంది. ఛత్తీస్‌గఢ్‌ఒడిశా సరిహద్దుల్లో ఇటీవల జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో కనీసం 27మంది మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి ఉన్నారు. ఆయన తలపై కోటి రూపాయల నజరానా ఉంది. నిఘా వర్గాల పక్కా సమాచారంతో ఛత్తీస్‌గఢ్‌ఒడిశాకు చెందిన సంయుక్త బలగాలు గరియాబంద్ జిల్లా పరిధిలోని కులహాదీ ఘాట్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఛత్తీస్‌గఢ్‌ఒడిశా సంయుక్త బృందాలు ఈ 30, సిఆర్‌పిఎఫ్, కోబ్రా 25 బెటాలియన్‌కు చెందిన జవాన్లు, సిఆర్‌పిఎఫ్ 65, 201 బెటాలియన్‌తో పాటు ఎస్‌ఓజి నువ్వా పాడ బృందం సెర్చింగ్ ఆపరేషన్ చేపట్టాయి. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య అడపదడపా కాల్పులు కొనసాగుతున్నాయి. ఆపరేషన్ సమయంలో ఎస్ఎల్ఆర్ రైఫిల్‌తో పాటు పెద్ద ఎత్తున ఆటోమేటిక్ ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఒడిశా మావోయిస్టు సంస్థ అధిపతి, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డు కూడా ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున సెర్చింగ్ ఆపరేషన్ కొనసాగింది. ఈ ఎన్‌కౌంటర్‌తో నక్సలిజానికి మరో గట్టి దెబ్బ తగిలిందని, నక్సల్స్ రహిత భారత్ నిర్మాణంలో భద్రతా బలగాలు పెద్ద విజయాన్ని సాధించాయని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. సిఆర్‌పిఎఫ్, ఎస్‌ఒజి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఒడిశా -ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో సంయుక్త ఆపరేషన్‌లో 27 మంది నక్సలైట్లను మట్టుబెట్టారని అన్నారు. నక్సల్స్ రహిత భారతదేశం కోసం మన సంకల్పం, మన భద్రతా దళాల ఉమ్మడి ప్రయత్నాలతో నక్సలిజం తుదిశ్వాస విడిచిందంటూ తన వ్యాఖ్యానించారు. 2026 మార్చికల్లా చత్తీస్‌గఢ్ నక్సల్స్ రహిత రాష్ట్రం కాగలదని రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ అన్నారు. పోలీసులు, సీఆర్ పీఎఫ్ జవాన్ల సాహసం వల్లనే ఇది సాధ్యమవుతోందని చెబుతూ వారికి శాల్యూల్ అన్నారు. నిరుడు వివిధ ఎన్ కౌంటర్లలో దాదాపు 219 మంది నక్సల్స్ హతమయ్యారు. ఇకపోతే ఇండియాలో మావోయిస్టు పార్టీ 'నూతన ప్రజాస్వామిక విప్లవ' లక్ష్యాన్ని చేరుకోగలదన్న ఆశలు ఎప్పుడో అడుగంటాయి. అందుకు తగిన వాతావరణం కూడా లేకుండా పోయింది. ప్రజలంతా సొంతంగా భూమికోసం, భుక్తి కోసం పోరాడుతున్నారు. వారికి అండగా మావోయిస్టులు ఎక్కడా కానరావడం లేదు. తాజా పరిస్థితుల్లో ఉనికి అన్నది మావోయిస్టులకు ఒక సవాల్ అని చెప్పక తప్పదు. తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం వస్తుందన్న నినాదానికి కాలం చెల్లింది. విప్లవ యుద్ధం అనేది ప్రజలను సమీకరించడం ద్వారా, వారిపై ఆధారపడటం ద్వారా మాత్రమే సాధించగలం. అయితే ఈ దేశంలో మావోయిస్టు పార్టీ చేస్తున్న పోరాటాల్లో ప్రజల భాగస్వామ్యం లేకుండా పోయింది. ప్రజలతో సంబంధం లేకుండా చేస్తున్న పోరాటాలకు కాలం లేదన్న విషయం బలపడిపోయింది. చెల్లదని కూడా తేలిపోయింది. మావోయిస్టులు బాగా బలపడ్డ సందర్భాల్లో ప్రభుత్వాలు ఇంత శక్తిమంతంగా లేవు. అలాగే ప్రజలు కూడా బలంగా మావోయిస్టుల వెంట నడిచారు. మేధావులు, పత్రికలు కూడా అండగా నిలిచాయి. ఏ విప్లవమైనా ప్రారంభించే ముందు పరిస్థితులను సంపూర్ణంగా అధ్యయనం చేసి అంచనా వేయాలని కూడా మార్క్, ఎంగెల్స్ చెప్పారు. అలాంటి అంచనాల్లోనూ మావోయిస్టు పార్టీ విఫలమైందన్న భావన కలుగుతోంది. ప్రపంచంలో సోషలిస్టు శిబిరాలు కూలిపోయాక, పెట్టుబడిదారీ వ్యవస్థ, స్వేచ్ఛా వాణిజ్యం వర్ధిల్లుతున్నవి. ఈ దశలో భారతదేశంలో విప్లవం విజయవంతం కావడంపై అనుమానాలు సహజం. విప్లవం పతాక స్థాయికి చేరడానికి భారత్ చాలా దూరంలో ఉన్నది. విప్లవకారులు అత్యుత్సాహంతో కేవలం సాయుధ పోరాటాన్ని మాత్రమే ఆశ్రయించారన్న విమర్శలున్నవి. ప్రజలకు దూరంగా చేసే పోరాటం ఎప్పటికీ నిలబడదు. ప్రజాస్వామ్యంలో ప్రజలను దూరం పెట్టిన రాజకీయ పార్టీలే మట్టి కరుస్తున్నాయి.

# గుల్లెయిన్ బారే సిండ్రోమ్‌తో తొలిమరణం

**101కు చేరిన పుణేలో జీబీఎస్ సోకిన వారి సంఖ్య**

**16 మంది రోగుల పరిస్థితి విషమం**



ముంబై,జనవరి 27 : గుల్లెయిన్ బారే సిండ్రోమ్‌తో మహారాష్ట్రలో తొలి మరణం నమోదైన ట్లుగా తెలుస్తున్నది. సోలాపూర్‌లో ఓ వ్యక్తి మరణించగా.. మరణానికి జీబీఎస్ కారణంగా మరణించినట్లుగా ఆరోగ్యశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో సిండ్రోమ్ బారినపడుతున్న రోగుల సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉన్నది. పుణేలోనే వంద మందికిపైగా రోగులున్నారు. మృతుడిని సోలాపూర్ నివాసిగా గుర్తించారు. సదరు వ్యక్తి కొద్దిరోజుల కిందట పుణేకు వచ్చాడని.. ఆ సమయంలోనే సిండ్రోమ్ సోకినట్లుగా భావిస్తున్నారు. ఇమ్యునోలాజికల్ నరాల వ్యాధి గుల్లెయిన్ బారే సిండ్రోమ్ వ్యాప్తి పుణేలో ఎక్కువగా కనిపిస్తున్నది. ఆదివారం నాటికి సంఖ్య వందకుపైగా దాటింది. పుణేలో జీబీఎస్ సోకిన వారి సంఖ్య 101కి పెరిగింది. ఇందులో 68 మంది పురుషులు, మరో 33 మంది మహిళలు ఉన్నారు. ఇందులో 16 మంది రోగుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వారికి వెంటిలేటర్ సహాయంతో చికిత్స అందిస్తున్నారు. పుణే మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన రాపిడ్ రెస్పాన్స్ టీం, ఆరోగ్యశాఖ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. ముఖ్యంగా పుణేలోని సింఘాడ్ రోడ్డులో గరిష్ఠ సంఖ్యలో రోగులను గుర్తించారు. ప్రస్తుతం ప్రత్యేకంగా నిఘా వేశారు. ఇప్పటివరకు, రాష్ట్రంలో 25,578 ఇళ్లను సర్వే చేశారు. ఇందులో 15,761 ఇండ్లు పుణే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. మరో 3,719 నివాసాలు చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. 6,098 ఇండ్లు రూరల్ ప్రాంతానికి వస్తాయి. గుల్లెయిన్ బారే సిండ్రోమ్.. జీబీఎస్ అనేది రోగనిరోధక నాడీ వ్యాధి. వ్యాధి సోకితే చేతులు, కాళ్లు అకస్మాత్తుగా తిమ్మిరి వస్తాయి. కండరాలు బలహీనంగా మారుతాయి. వ్యాధి లక్షణాల్లో బలహీనత.. విరేచనాలు ఉంటాయి. సాధారణంగా జీబీఎస్ సమస్య బాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్ రోగనిరోధక శక్తిని కూడా బలహీనంగా మారు-స్తుంది. పిల్లలు, యువత ఎక్కువగా ఈ వ్యాధి బానిపడుతున్నారు. వ్యాధి బారినపడ్డ వారంతా కోలుకుంటుండడం విశేషం. తాగునీటిని శుభ్రంగా ఉంచుకోవాలని, మరిగించి చల్లార్చిన నీటినే తాగాలని ప్రభుత్వం ప్రజలకు సూచించింది. ఆహారం సైతం శుభ్రంగా ఉంచుకోవాలని.. కూరగాయాలను శుభ్రంగా కడుక్కోవాలని.. బాగా ఉడికించి తినాలని వైద్యశాఖ అధికారులు సూచించారు.

# కుంభమేళాలో ఆ రోజు ఎంతో పవిత్రం



## 29న మౌని అమావాస్య

న్యూఢిల్లీ,జనవరి 27 :ఈసారి జరుగుతున్న మహాకుంభమేళా అత్యంత పవిత్రమైనది. 144 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే జరిగే అరుదైన ఖగోళ అమరిక ద్వారా వచ్చిన ఈ కుంభమేళా ఆధ్యాత్మికపరంగా ఎంతో విశిష్టమైనది. మహా కుంభమేళా సమయంలో అమృత స్నానానికి అత్యంత ప్రాముఖ్యతమైనది. కుంభమేళా పూర్తయ్యేలోగా 6 అమృత స్నానాలు ఉంటాయి. ప్రతి ఒక్కదానిని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ప్రత్యేకమైన రోజులలో రావడమే ఇందుకు కారణం. మకర సంక్రాంతి నాడు జరిగిన అమృత స్నాన్?తో సమానంగా మౌని అమావాస్య అమృత స్నాన్‌ను పరిగణిస్తారు. ఈ రోజున ఋషులు, సాధువులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. అందుకే ఈ అమృత స్నాన్ సమయంలోనే నాగ సాధువులకు దీక్ష కూడా ఇస్తారు. అదే మౌని అమావాస్య ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. మౌని అమావాస్య 2025 జనవరి 29న జరుపుకుంటారు. ఈ రోజునే మహాకుంభమేళాలో రెండవ అమృత స్నాన్ జరుగుతుంది. కుంభమేళా సమయంలో అమృత స్నానం ఆచరించడాన్ని అత్యంత పవిత్రమైనదిగా విశ్వసిస్తారు. మౌని అమావాస్య రోజుకు జరిగే అమృతస్నాన్‌కు మరింత ప్రాముఖ్యత ఉంది. అందువల్ల ఈ రోజున మహాకుంభ సమయంలో త్రివేణి సంగమంలోని పవిత్ర జలాలతో స్నానం చేయడాన్ని అమృతతుల్యంగా భావిస్తారు. హిందూ పురాణాలు ప్రకారం మౌని అమావాస్య నాడు అమృత స్నానం చేయడాన్ని అత్యంత పవిత్రమైనదిగా పరిగణిస్తారు. ఈ రోజున నాగ సాధువులు దండి కింద దీక్షను స్వీకరిస్తారు. మౌని అమావాస్య రోజున చంద్రుడిని పూజించడం వల్ల జాతకం బలపడుతుందని నమ్ముతారు. ఈ ప్రత్యేక సందర్భంలో పితృ పూజ చేసి పూర్వీకులను గౌరవిస్తే వారి ఆశీర్వాదాలు దక్కి కోరిన కోరికలు నెరవేరుతాయని విశ్వాసం. శివుని ఆరాధనకు, తాంత్రిక అభ్యాసాలు, మంత్ర సాధన, మంత్రాలను పఠించడానికి అత్యంత పవిత్రమైన రోజు ఇదే. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు పోటెత్తుతున్నారు. గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. ఈ కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 14 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. కుంభమేళా ప్రారంభైన జనవరి 13వ తేదీ నుంచి ఈనెల 26వ తేదీ వరకూ త్రివేణీ సంగమంలో 13.21 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు వెల్లడించింది. అందులో 10 లక్షల మంది కల్పవాసీలు కూడా ఉన్నట్లు పేర్కొంది. ఇక ఇవాళ ఉదయం 8 గంటల వరకూ దాదాపుగా 46.64 లక్షల మంది స్నానాలు ఆచరించినట్లు అధికారులు తెలిపారు. సంక్రాంతి రోజున ప్రారంభమైన (జనవరి 13) మహా కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో ముగుస్తుంది. 45 రోజులపాటు సాగనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల సంఖ్య 50 కోట్లు దాటుతుందని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో కోట్లాది మందికి తగిన రీతిలో ఏర్పాటు చేసింది యూపీ ప్రభుత్వం.

# మధ్యాహ్న భోజన పథకంలో పలు కీలక మార్పులు

**విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి**

**సిఎస్‌కు నివేదిక ఇచ్చిన విద్యా కమిషన్**

హైదరాబాద్,జనవరి 27 : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తోన్న మధ్యాహ్న భోజన పథకంలో పలు కీలక మార్పులు చేయాల్సి ఉందని విద్యా కమిషన్ అభిప్రాయపడింది. నాణ్యమైన భోజనం పెట్టాలని కోరింది. ఇటీవల పలు ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో వెలుగు చూసిన ఫుడ్ పాయిజన్ ఘటనలను దృష్టిలో ఉంచుకుని.. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలను విద్యా కమిషన్ సందర్శించింది. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, ఆహార నాణ్యత, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పన.. తదితర అంశాలను కమిషన్ పరిశీలించి ఓ నివేదికను రూపొందించింది. సీఎస్ శాంతికుమారికి కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు నివేదిక అందించారు. నివేదికలో ప్రధానంగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి మెనూలో చేయాల్సిన మార్పులపై నివేదికలో పలు సూచనలు చేసింది. 'వారం వారం బిల్లులను చెల్లించాలి. ఇంటర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలి. రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందించాలి. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులకు అవసరమైన కాస్మొటిక్స్, ఇతరత్రా సామగ్రిని తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలి. ఇలా సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ విధానం వల్ల విద్యార్థులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించవచ్చు' అని నివేదికలో కమిషన్ పేర్కొంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

మంగళవారం
28 జనవరి
2025







## టీమ్ఇండియాకు గొప్ప సూపర్‌స్టార్ దొరికాడు..

### తిలక్‌కు ఆ సత్తా ఉంది : అంబటి రాయుడు

ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో కీలక ఇన్నింగ్స్ ఆడి భారత జట్టును గెలిపించిన తిలక్ వర్మపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ఉత్కంఠభరితంగా సాగిన రెండో టీ20లో భారత్ రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 166 పరుగుల లక్ష్యాన్ని టీమ్ఇండియా 19.2 ఓవర్లలో ఛేదించింది. తిలక్ (72) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఆరంభంలో దూకుడుగా ఆడి ఇంగ్లాండ్ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించిన తిలక్.. మరో ఎండ్‌లో వరుసగా వికెట్లు పడటంతో మ్యాచ్ చివర్లో ఉత్కంఠభరితంగా మారింది. ఈక్రమంలో టెయిలెండర్లతో కలిసి జట్టును గట్టెక్కించాడు. ఈ మ్యాచ్‌లో అతను ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈనేపథ్యంలో తిలక్ వర్మపై భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ప్రశంసల వర్షం కురిపించాడు. తిలక్ టీ20 ప్లేయర్ మాత్రమే కాదని.. ఆల్-ఫార్మాట్ ప్లేయర్‌గా మారే సత్తా అతనికి ఉందన్నాడు. “టీమ్ఇండియాకు గొప్ప సూపర్‌స్టార్ దొరికాడని భావిస్తున్నా. అతను (తిలక్ వర్మ) టీ20 ప్లేయర్ మాత్రమే కాదు.. ఆల్-ఫార్మాట్ ప్లేయర్ కాగలడు. ఇంగ్లాండ్‌తో రెండో టీ20లో గొప్ప పరిపక్వత ప్రదర్శించాడు. చాలా సంవత్సరాలపాటు భారత్‌కు మ్యాచ్ విన్నర్‌గా ఉండగల సత్తా అతనికి ఉంది. కాబట్టి ప్రతి ఫార్మాట్‌లో తిలక్‌కు అవకాశాలు ఇస్తూ మద్దతుగా నిలవాలి. అతను సూపర్‌స్టార్ క్రికెటర్. హైదరాబాద్‌కు ఆడుతున్నప్పటినుంచి అతడిని చూస్తున్నా. గత నాలుగు ఇన్నింగ్స్‌ల్లో అద్భుతంగా ఆడాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తిలక్‌పై నమ్మకం ఉంచాడు. తనపై పెట్టుకున్న నమ్మకానికి అతను న్యాయం చేస్తున్నాడు’ అని రాయుడు స్టార్‌స్పోర్ట్స్‌తో అన్నాడు. భారత్, ఇంగ్లాండ్ మధ్య మూడో టీ20 మంగళవారం (జనవరి 28) రాజ్‌కోట్‌లో జరగనుంది. మూడో మ్యాచ్‌లో గెలిచి మరో రెండు టీ20లు మిగిలివుండగానే సిరీస్‌ను కైవసం చేసుకోవాలని టీమ్ఇండియా పట్టుదలతో ఉంది.

## ఐసీసీ టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా

# జస్‌ప్రీత్ బుమ్రా



భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్‌ను ప్రతిష్టాత్మక ఐసీసీ అవార్డు వరించింది. 2024 సంవత్సరానికిగాను టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు అతను ఎంపికయ్యాడు. జో రూట్ (ఇంగ్లాండ్), కమిందు మెండిస్ (శ్రీలంక), హ్యారీ బ్రూక్ (ఇంగ్లాండ్)లను వెనక్కినెట్టి బుమ్రా ఈ అవార్డును దక్కించుకున్నాడు. ఈ క్రమంలోనే టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్న ఆరో భారత క్రికెటర్‌గా బుమ్రా నిలిచాడు. రాహుల్ ద్రవిడ్ (2004), గౌతమ్ గంభీర్ (2009), వీరేంద్ర సెహ్వాగ్ (2010), రవిచంద్రన్ అశ్విన్ (2016), విరాట్ కోహ్లీ (2018) బుమ్రా కంటే ముందు ఈ అవార్డు అందుకున్నారు. 2024 ఐసీసీ టెస్టు జట్టులోనూ బుమ్రా చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే. గతేడాది టెస్టుల్లో బుమ్రా అద్భుతమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. 13 మ్యాచ్‌ల్లో 71 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలోనే 2024లో సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టించాడు.

### వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా స్మృతి మంధాన



భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన 2024 సంవత్సరానికిగాను వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు గెలుచుకుంది. లారా వోల్వార్ట్ (దక్షిణాఫ్రికా), చమరి ఆటపట్టు (శ్రీలంక), అన్నాబెల్ సదర్లాండ్ (ఆస్ట్రేలియా)తో పోటీపడి ఈ అవార్డును సొంతం చేసుకుంది. 28 ఏళ్ల మంధాన ఈ ప్రతిష్టాత్మక అవార్డును గెలుచుకోవడం ఇది రెండోసారి. 2018లో మొదటిసారిగా వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైంది. ఈ క్రమంలోనే మహిళల క్రికెట్‌లో సుజీ బేట్స్ (న్యూజిలాండ్) తర్వాత రెండోసారి ఈ అవార్డు అందుకున్న రెండో ప్లేయర్‌గా స్మృతి మంధాన నిలిచింది. మంధాన 2018, 2021 సంవత్సరాల్లో ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును సొంతం చేసుకుంది. భారత వైస్ కెప్టెన్‌గా ఉన్న మంధాన గతేడాది వన్డేల్లో అదరగొట్టింది. 13 మ్యాచ్‌ల్లో 57.46 సగటుతో 747 పరుగులు చేసి అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా నిలిచింది. ఇందులో నాలుగు సెంచరీలు, 3 హాఫ్ సెంచరీలున్నాయి. పురుషుల విభాగంలో వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు అఫ్గానిస్థాన్ ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ ఎంపికయ్యాడు.

## పాక్‌కు విండీస్ షాక్.. 35 ఏళ్లకు తొలి విజయం



ముల్తాన్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో పాకిస్థాన్‌కు షాక్ తగిలింది. పాక్‌పై విండీస్ 120 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. పాకిస్థాన్ గడ్డపై కరేబియన్ జట్టు 35 ఏళ్లకు టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించడం విశేషం. దీనికంటే ముందు విండీస్ 1990 నవంబర్‌లో ఫైసలాబాద్‌లో జరిగిన టెస్టులో పాకిస్థాన్‌పై గెలిచింది. తర్వాత 1997, 2006లో పాక్ పర్యటనకు వెళ్లినా ఒక్క విజయం సాధించకుండానే ఇంటిముఖం పట్టింది. మళ్లీ ఇన్నాళ్లకు పాక్ గడ్డపై గెలిచి సంచలనం సృష్టించింది. 254 పరుగుల ఛేదనలో 76/4తో సోమవారం (మూడో రోజు) ఆటను ప్రారంభించిన పాకిస్థాన్.. 133 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో బాబర్ అజామ్ (31) టాప్ స్కోరర్. మహ్మద్ రిజ్వాన్ (25), కమ్రాన్ గులాం (19), సౌద్ షకీల్ (13), సల్మాన్ ఆఘా (15) పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ స్పిన్నర్లు జోమెల్ వారికన్ (5/35), కెవిన్ సింక్లైర్ (3/61), గుడాకేష్ మోటీ (2/35) పాక్‌ను దెబ్బకొట్టారు. ఈ మ్యాచ్‌లో విండీస్ గెలవడం అద్భుతమే అని చెప్పాలి. ఎందుకంటే తొలి ఇన్నింగ్స్‌లో 38/7 పీకల్లోతు కష్టాల్లో పడిన ఆ జట్టును టెయిలెండర్లు గుడాకేష్ మోటీ (55), కెమర్ రోచ్ (25), వారికన్ (36)లు ఆదుకున్నారు. దీంతో ఆ జట్టు 163 పరుగులు చేసి మళ్లీ పోటీలో నిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 244 పరుగులు చేసింది. పాక్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 154 పరుగులు, సెకండ్ ఇన్నింగ్స్‌లో 133 రన్స్‌కు కుప్పకూలింది.



## ఆమె నాకు చెల్లెలు లాంటిది..

### బాలీవుడ్ సింగర్‌తో డేటింగ్ వార్తలపై సిరాజ్ క్లారిటీ

టీమ్ఇండియా పేసర్ మహ్మద్ సిరాజ్ బాలీవుడ్ సింగర్ జనై భోస్లేతో ప్రేమలో పడ్డట్లు వార్తలొచ్చాయి. ఇటీవల ముంబయిలోని బాంద్రాలో జరిగిన ఆమె 23వ పుట్టినరోజు వేడుకలకు సిరాజ్ హాజరయ్యాడు. ఈ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన ఫొటోలను ఆమె తన ఇన్‌స్టాలో పోస్టు చేయగా.. అందులో సిరాజ్, జనై కలిసి దిగిన పిక్ కూడా ఉంది. అయితే, ఆ ఫొటోలో ఇద్దరూ కాస్త సన్నిహితంగా ఉన్నట్లు కనిపించడంతో, వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నట్లు పలు వెబ్‌సైట్‌లు వార్తలు రాసుకొచ్చాయి. దీంతో ఇదేదో తేడా కొట్టేలా ఉందని గ్రహించిన సిరాజ్ వెంటనే అలర్ట్ అయ్యాడు. దయచేసి అసత్య ప్రచారాలు చేయొద్దని.. జనై తనకు చెల్లెలు లాంటిదని ఇన్‌స్టా స్టోరీలో క్లారిటీ ఇచ్చాడు. ఫొటోను షేర్ చేస్తూ.. ‘ఆమె లాంటి సోదరి నాకెవరూ లేరు. ఆమె లేకుండా నేను ఎక్కడా ఉండాలనుకోను. నక్షత్రాలతో చంద్రుడు ఉన్నట్లే.. ఆమె వెయ్యి మందిలో ఒకరు’ అనే కవిత్వాన్ని సిరాజ్ తన ఇన్‌స్టా స్టోరీలో పోస్టు చేశాడు. మరోవైపు, జనై సైతం ఈ ఊహాగానాలపై స్పందించారు. సిరాజ్ తనకు ప్రియమైన సోదరుడని పేర్కొంటూ ఇన్‌స్టా స్టోరీలో పోస్టు పెట్టారు. ఇంతకీ జనై భోస్లే ఎవరో తెలుసా లెజెండరీ సింగర్ ఆశా భోస్లే మనవరాలు.

## ముంబై జట్టుకు రోహిత్, యశస్వి, అయ్యర్ దూరం



ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నీ రంజీ ట్రోఫీ 2024-25లో ముంబై ఆఖరి లీగ్ మ్యాచ్‌కు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ ఓపెనర్ యశస్వి జైస్వాల్, మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ దూరం కానున్నారు. మేఘాలయతో గురువారం నుంచి ముంబై తమ ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడనుంది. అయితే ఈ మ్యాచ్‌కు భారత స్టార్ ఆటగాళ్లు దూరంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే శివమ్ దూబే.. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ నేపథ్యంలో ముంబై జట్టుకు దూరమైన సంగతి తెలిసిందే. నితీష్ కుమార్ రెడ్డి పక్కటెముకల గాయంతో సిరీస్ మొత్తానికి దూరమవ్వడంతో అతని స్థానంలో శివమ్ దూబేకు అవకాశం దక్కింది. ఇప్పటికే దూబే భారత జట్టుతో కలిసాడు. మరోవైపు బీసీసీఐ వార్షిక అవార్డ్‌ల కార్యక్రమం నేపథ్యంలోనే రోహిత్, యశస్వి, అయ్యర్‌లు ముంబై ఆఖరి లీగ్ రంజీ మ్యాచ్‌కు దూరంగా ఉంటారని తెలుస్తోంది. ఫిబ్రవరి 1న ముంబైలో ఈ కార్యక్రమం జరగనుంది. ఫిబ్రవరి రెండో తేదీనే ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ క్యాంప్ నాగ్‌పూర్ వేదికగా ప్రారంభం కానుంది. ఈ క్రమంలోనే ముంబై ఆఖరి లీగ్ మ్యాచ్‌కు స్టార్ ఆటగాళ్లంతా దూరంగా ఉంటారని ఓ బీసీసీఐ అధికారి తెలిపాడు. ఫిబ్రవరి 6 నుంచి ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. 10 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రంజీ మ్యాచ్ ఆడిన రోహిత్.. తీవ్రంగా నిరాశపరిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 3, రెండో ఇన్నింగ్స్‌లో 28 పరుగులే చేసి వెనుదిరిగాడు. అయ్యర్ 11, 17 పరుగులే చేయగా.. యశస్వి జైస్వాల్ కూడా దారుణంగా విఫలమయ్యాడు. దాంతో జమ్మూ కశ్మీర్ ముంబైపై ఘన విజయం సాధించింది. ప్రస్తుతం ముంబై 22 పాయింట్లతో ఉంది. మేఘాలయపై ఆ జట్టు గెలిస్తేనే నాకౌట్ అవకాశాలు సజీవంగా ఉంటాయి. ముంబై నాకౌట్ చేరాలంటే.. జమ్మూ కశ్మీర్ చేతిలో బరోడా ఓటమిపాలవ్వాలి. రోహిత్ శర్మ కారణంగా గత మ్యాచ్‌కు దూరంగా ఉన్న ఆయుష్ మాత్రమే, సుయాన్ష్ షెడ్గే జట్టులోకి రానున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ సూపర్ ఫామ్‌లో ఉన్నారు.



## ఐపీఎల్‌లో ఏబీ డివిలియర్స్ సరైన జట్టుకు ఆడలేదు

### సంజయ్ షాకింగ్ కామెంట్స్

ఏబీ డివిలియర్స్.. టీమ్ఇండియా క్రికెట్ ఫ్యాన్స్ అభిమానించే అతి తక్కువమంది విదేశీ ఆటగాళ్లలో ఒకడు. ఈ మిస్టర్ 360 డిగ్రీల ఆటగాడు ఐపీఎల్‌లో ఎన్నో అద్భుతమైన విన్యాసాలు చేసి అభిమానుల మనసు దోచుకున్నాడు. ఐపీఎల్ ప్రారంభమైన మొదట్లో కొన్ని సీజన్లు ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరఫున ఆడిన డివిలియర్స్.. 2011-2021 వరకు 11 ఏళ్లపాటు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడాడు. 2021లో రిటైర్మెంట్ ప్రకటించిన అతను ఐపీఎల్‌లో మొత్తం 184 మ్యాచ్‌ల్లో 39.71 సగటు, 151.69 స్ట్రైక్‌రేట్‌తో 5,162 పరుగులు చేశాడు. ఇందులో 3 సెంచరీలు, 40 అర్ధ సెంచరీలున్నాయి. కానీ, ఆటగాడిగా ఒక్కసారి కూడా అతను ఐపీఎల్ టైటిల్‌ను ముద్దాడలేదు. ఇక, డివిలియర్స్ ఐపీఎల్ కెరీర్ గురించి భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. ఐపీఎల్‌లో డివిలియర్స్ సరైన ఫ్రాంఛైజీ (జట్టు)కు ఆడలేదని వ్యాఖ్యానించాడు. అతడిని సరిగ్గా ఉపయోగించుకోలేదని, బ్యాటింగ్ ఆర్డర్‌లో ఇంకా ముందు ఆడాల్సిందని అభిప్రాయపడ్డాడు. మిస్టర్ 360గా ఏబీ డివిలియర్స్‌ను సూర్యకుమార్ యాదవ్ డామినేట్ చేశాడా? అని స్టార్‌స్పోర్ట్స్ షోలో మంజ్రేకర్‌ను ప్రశ్నించగా.. ‘మ్యాచ్ విన్నింగ్ ఇంపాక్ట్‌పరంగా నేను అవుననే చెబుతాను. డివిలియర్స్ అద్భుతమైన ప్లేయర్. టెస్టుల్లో అతని సగటు 50. వన్డేల్లో ఇది అంతకంటే ఎక్కువ (53) ఉంది. టీ20 క్రికెట్‌లో సగటు తక్కువగా ఉంది. ఎన్నో శక్తిసామర్థ్యాలు అతడి సొంతం. అయితే, ఐపీఎల్‌లో అందుకు తగ్గట్టుగా అతడిని ఉపయోగించుకోలేదు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఇంకా ముందు రావాల్సింది. ఇలా చెబుతున్నందుకు నన్ను క్షమించండి.. కానీ, డివిలియర్స్ సరైన జట్టుకు ఆడలేదు. వేరే టీమ్‌కు ఆడితే ఏబీ డివిలియర్స్ గొప్పతనాన్ని మనం చూసేవాళ్లం’ అని సమాధానమిచ్చాడు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News




## క్యూట్ పూజా అందాల షో!

తెలుగు ప్రేక్షకులకు ఒక లైలా కోసం సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ పూజా హెగ్డే. ఆ తర్వాత ముకుంద సినిమాలోనూ నటించింది. మొదటి రెండు సినిమాలు తెలుగులో ఈ అమ్మడికి మినిమం గుర్తింపు తెచ్చి పెట్టలేదు. దాంతో బాలీవుడ్‌లో ఈ అమ్మడు సినిమా చేసేందుకు రెండేళ్లు టాలీవుడ్‌కి దూరంగా ఉంది. టాలీవుడ్‌లో ఈ అమ్మడు తిరిగి డీజే సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చింది. అల్లు అర్జున్ హీరోగా నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఒక్కసారిగా టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్స్ సరసన నిలిచింది. తెలుగులో వెనక్కి తిరిగి చూసుకోకుండా ఈ అమ్మడు సినిమాలు చేసింది. 2017లో వచ్చిన డీజే సినిమాతో టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా మారింది. దాదాపుగా దశాబ్ద కాలం పాటు ఈ అమ్మడు వరుసగా సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. అనూహ్యంగా ఈ మధ్య కాలంలో ఈమెకి ఆఫర్లు తగ్గాయి. సినిమాల్లో ఈ అమ్మడి జోరు తగ్గినా సోషల్ మీడియాలో మాత్రం జోరు తగ్గలేదు. తెలుగులో ఈమె సినిమా వచ్చి చాలా కాలం అయ్యింది. అయితే సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలతో వార్తల్లో ఉండటం వల్ల తిరిగి బిజీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఏడాది ఒక్క సినిమాను చేయలేక పోయిన ఈ అమ్మడు ప్రస్తుతం మూడు నాలుగు సినిమాలతో బిజీగా ఉండటం విశేషం. ముఖ్యంగా తమిళ్ స్టార్ హీరోకి జోడీగా ఈమె నటిస్తున్న కారణంగా సౌత్‌లో మళ్లీ ఈమె టైం స్టార్ట్ అయ్యిందనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈమె అందాల జోరు కంటిన్యూ అవుతోంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈమె సొంతం కావడంతో ఎలాంటి ఫోటోలు షేర్ చేసినా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన క్లీవేజ్ షో ఫోటోలు వైరల్ అవుతున్నాయి. వైట్ ఔట్‌ఫిట్‌లో మెరుస్తున్న పూజా హెగ్డే అందానికి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు.

## నేషనల్ క్రష్ హాలీవుడ్ అందం

నేషనల్ క్రష్ రష్మిక మందన్న పుష్ప 2 సినిమాతో మరోసారి పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. యానిమల్ సినిమా తర్వాత ఏమాత్రం గ్యాప్ లేకుండా పుష్ప 2 సినిమాతో బాక్సాఫీస్‌ని షేక్ చేయడం ద్వారా ఇండియాలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్స్ జాబితాలో చేరిపోయింది. బాలీవుడ్‌లో ఎంతో మంది ముద్దుగుమ్మలు ఉన్నా ఈ అమ్మడికి అరుదైన గౌరవం, గుర్తింపులు దక్కుతున్నాయి. తాజాగా ది హాలీవుడ్ రిపోర్టర్ మ్యాగజైన్ కవర్ పై ఈ అమ్మడికి చోటు దక్కింది. బాలీవుడ్‌కి చెందిన అతి తక్కువ మంది హీరోయిన్స్‌కి ఈ అరుదైన గౌరవం దక్కిందని ఫ్యాన్స్ సోషల్ మీడియా ద్వారా కామెంట్స్ చేస్తున్నారు.

రష్మిక మందన్న త్వరలో చావా సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటించిన చావా సినిమాలో హీరోయిన్‌గా రష్మిక మందన్న నటించింది. బాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ సినిమా నుంచి ఇటీవలే రష్మిక పాత్రకు సంబంధించిన లుక్ రివీల్ అయ్యింది. ఆ పాత్రకు రష్మిక న్యాయం చేసే విధంగా లుక్ ఉంది అంటూ విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. సక్సెస్ జోష్ మీద ఉన్న రష్మిక మందన్న మరో విజయాన్ని తన ఖాతాలో చావా సినిమా ద్వారా దక్కించుకోవడం ఖాయం అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో రష్మికకి ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

ఆ ఫాలోయింగ్, వరుస సక్సెస్‌ల కారణంగానే ది హాలీవుడ్ రిపోర్టర్ మ్యాగజైన్ కవర్ పై ఎక్కింది. ఎంతో మంది హాలీవుడ్ ముద్దుగుమ్మలు అతి కొద్ది మంది బాలీవుడ్ ముద్దుగుమ్మలకు దక్కిన ఈ అవకాశం మన నేషనల్ క్రష్ కి దక్కింది అంటూ అభిమానులు ఈ కవర్ ఫోటోలను తెగ షేర్ చేస్తున్నారు. నెట్టింట ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. బ్లాక్ డ్రెస్‌లో కవ్వించే చూపులతో రష్మిక మందన్న కెమెరాకు ఇచ్చిన ఫోజ్‌తో నెటిజన్స్ కిల్ అవుతున్నారు. కిల్లింగ్ లేడీ అంటూ రష్మిక ఫోటోలకు కామెంట్స్ చేస్తున్నారు. స్కిన్ షో ఎక్కువ చేయకున్నా సోషల్ మీడియాలో ఈ స్థాయిలో వైరల్ కావడం విశేషం.



## అందంతో కట్టిపడేస్తున్న ఈషారెబ్బ

నెట్టింట్లో ఎప్పుడూ తన గ్లామర్ ఫొటోలతో రచ్చ చేసే ముద్దుగుమ్మల్లో ముందు వరసలో ఉంటుంది బ్యూటీ ఈషా రెబ్బ.ఈ బ్యూటీ అంతక ముందు తర్వాత అనే సినిమాతో తెలుగ చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టింది. అయితే ఈ బ్యూటీకి అవకాశాలు మాత్రం తక్కువే అని చెప్పాలి. అందం, అభినయం ఎంత ఉన్నా, అవకాశాల్లో మాత్రం చివరి ప్లేస్‌లో ఉ ంటుంది. ఈ అందాల తార. ఎప్పుడూ మంచి అవకాశాల కోసం పోరాటం చేస్తూనే ఉంటుంది. ఇక ఈ బ్యూటీ ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన గ్లామర్‌తో కుర్రకారుకు పిచ్చెక్కిస్తుంటుంది. తాజాగా ఈముద్దుగుమ్మ ఇన్ స్టాగ్రామ్‌లో చీరకట్టులో ఉన్న ఫొటోలను షేర్ చేసింది. ఇందులో ఈషా స్లీవ్ లెస్ జాకెట్ ధరించి, చీరలో చాలా అందంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెటిజన్స్‌ను తెగ ఆకట్టుకుంటున్నాయి.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986